www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 10-9-2025 | పేజీలు: 10 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 162 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం, తిథి: తదియ మ.3:38 తదుపరి చవితి, నక్షత్రం: రేవతి సా.4:03 తదుపరి అశ్వని, వర్జ్యం: శేషం ఉ. 6.32, దుర్ముహూర్తం: ఉ.11:47-12:36, అమృతఘడియలు: మ.1:51-3:19, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:06, సూర్యాస్తమయం: 6:18 | అనంతపురము సిటీ**

Ananthapuramu | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కొండమ్మ, చంద్రికకు ఉద్యోగాలు

నాగమ్మను వెంటాడిన

దురదృష్టం

8



డీఎస్సీ-2025లో ఎంపికపై ఉన్నతాధికారుల స్పష్టత

నాలుగు దశల్లో స్థానిక ఎన్నికలు

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని

8



మహా వేడుక

సూపర్‌హిట్ సభకు బీజేపీ నేతలు

రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు స్వాగతం పలుకుతున్న కొనకొండ్ల రాజేష్, నాయకులు

7



జగన్.. నీకు సిగ్గుందా..?

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఫైర్ (వివరాలు 7లో)

నేడు అనంతలో సూపర్ సిక్స్.. సూపర్ హిట్ సభ


- మాటమీద నిలబడ్డ కూటమి పార్టీలు
- సగర్వంగా జనం మధ్య నేడు విజయోత్సవం

సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని పాలించడమే ఓ సవాలు. వైసీపీ హయాంలో ఒకటో తేదీ ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితి. అలాంటి సమయంలో.. 15 నెలల క్రితం పాలనా పగ్గాలు చేపట్టింది టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం. సమస్యలను జయించి.. హామీలను అమలు చేసి.. రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టించింది. అనతి కాలంలో 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేసి.. అబ్బురపరిచింది. ఆ సంతోషాన్ని జనంతో పంచుకునేందుకు 'సూపర్ హిట్' సభను నిర్వహిస్తోంది. దీనికోసం ఏకంగా 50 ఎకరాల విస్తీర్ణంలో మహా ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. అనంతపురం నగర శివారులోని శ్రీనగర్ కాలనీలో పటిష్ఠ భద్రత నడుమ బుధవారం ఈ సభను నిర్వహిస్తున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, కూటమి పార్టీల కీలక నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నారు. పాలన ప్రారంభించాక అమలు చేసిన హామీలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు ప్రజలకు వివరిస్తారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం

తల్లికి వందనం

వైసీపీ ప్రభుత్వం ఇంట్లో ఎంత మంది బిడ్డలుంటే ఉంటే అంత మందికీ అమలు చేస్తామని మాటిచ్చి.. ఒక్కరికే ఇచ్చింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అందరికీ ఇచ్చింది. ఒక్కో బిడ్డకు రూ.13 వేలు చొప్పున.. ఎంత మంది ఉంటే అంత మందికి సొమ్మును 'అమ్మ' ఖాతాలో జమ చేసింది.





అన్న క్యాంటీన్

వైసీపీ హయాంలో మూతబడిన అన్న క్యాంటీన్‌లను అధికారం చేపట్టగానే ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా వందలాది అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేశారు. రూ.5 కే కడుపు నిండా అన్నం పెడుతున్నారు.



అన్నదాత సుఖీభవ

రైతులకు ఏటా పెట్టుబడి సాయం అందించే పథకం ఇది. ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇచ్చే పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. తొలివిడత రూ.7 వేలు ఇప్పటికే రైతుల ఖాతాలో జమ చేసింది.

ఎన్టీఆర్ భరోసా పింఛన్

ఏ ప్రభుత్వమైనా అధికారంలోకి వచ్చాక పథకాలను అమలు చేస్తాయి. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టక రెండు నెలల ముందు నుంచే అమలు చేసిన పథకం ఇది. ఎన్నికలకు ముందు రెండు నెలలతో కలిపి, మూడు నెలల పింఛన్‌లను ప్రభుత్వం ఏర్పడిన తొలి నెలలో పంపిణీ చేసింది. అదీ.. పెంచిన పింఛన్‌లను అందించింది. వైసీపీ హయాంలో రూ.3 వేలు ఉండగా.. రూ.4 వేలకు పెంచారు. వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు.. ఇలా అన్ని విభాగాల వారికీ పింఛన్‌లను భారీగా పెంచారు.



స్త్రీ శక్తి పథకం

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చంద్రబాబు మాటిచ్చారు. ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీన ఈ పథకాన్ని అమలులోకి తెచ్చారు. తరతమ బేధాలు లేకుండా.. మహిళలందరికీ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. రాష్ట్ర పరిధిలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా 'జీరో ఫేర్' టిక్కెట్ ప్రయాణం ఇది.





ఉచిత వంట గ్యాస్

మహిళలకు ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ప్రకటించి, ఇప్పటికే రెండు సిలిండర్లను ఇచ్చేసింది కూటమి ప్రభుత్వం. ఇలా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసిన ప్రభుత్వం.. సూపర్ హిట్ అయింది. ఈ అంశాలను ప్రజలకు వివరించేందుకు 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' పేరిట బహిరంగ సభను నిర్వహిస్తోంది.

పకడ్బందీగా మొబిలైజేషన్

- కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో మొబిలైజేషన్ ప్రణాళిక పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. కలెకరేట్‌లో మంగళవారం ఆయన డీఆర్డీఏ, డ్వామా శాఖల అధికారులు, సిబ్బందితో సీఎం పర్యటనపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల నుంచి సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభలో పాల్గొనేందుకు భారీ స్థాయిలో ప్రజలు వస్తున్న నేపథ్యంలో నియోజకవర్గాల వారిగా ప్రణాళికను గూగుల్ షీట్‌లో ఎక్కించాలన్నారు. మధ్యాహ్నం నుంచి ఫోన్ చేసి మీ గ్రామాలకు బస్సు చేరిందా? బుధవారం ఎన్ని గంటలకు బయలుదేరుతారు? కార్యక్రమం వద్ద జాగ్రత్తగా ప్రజలను దింపడం, తిరిగి ఎప్పటికి వారి స్వస్థలాలకు వెళ్తారనే వివరాలను ముందుగానే తెలుసుకోవాలన్నారు. మండలాల వారిగా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి అందులో ఏపీఎం, ఏపీఓలు, కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బందిని యాడ్ చేసి ఎప్పటికప్పుడు మానిటర్ చేసేలా చూడాలన్నారు. ఈ విషయంపై డ్వామా పీడీ పూర్తిగా పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ మలోల, డీఆర్డీఏ పీడీ శైలజ, డ్వామా పీడీ సలీంబాషా, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూరియాపై వైసీపీ దుష్ప్రచారం

- రైతుల అవసరం మేరకు సరఫరా
- క్యాన్సర్ వస్తుందనే కేంద్రం తగ్గించమంటోంది
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు



సభా వేదికను పరిశీలిస్తున్న అచ్చెన్నాయుడు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): యూరియాపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, అవసరాల మేరకు యూరియా అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభలో పాల్గొనేందుకు ఆయన బుధవారం జిల్లా కేంద్రానికి వచ్చారు. ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం సభా వేదిక వద్ద మీడియాతో మాట్లాడారు. వైసీపీ పాలనలో యూరియా ఇవ్వకుండా రైతులకు నరకం చూపించారని అన్నారు. నాడు యూరియా కోసం రైతులు కన్నీళ్లు పెట్టుకునే పరిస్థితి తీసుకొచ్చారని విమర్శించారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 81 వేల హెక్టార్లతో అధికంగా పంటలు వేశారని, వ్యవసాయంలో యూరియా వాడకాన్ని తగ్గించాలని కేంద్రం సూచించిందని అన్నారు. యూరియా వాడకం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని, అందుకే వాడకాన్ని తగ్గించాలని కేంద్రం సూచించిందని అన్నారు. వైసీపీ నాయకులు వాస్తవాలను కప్పి పెట్టి, యూరియాపై దుష్ప్రచారం చేస్తున్నారని, అందుకే రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. వైసీపీ నాయకులు జగన్ పత్రిక, చానల్‌లో అసత్యాన్ని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. భవిష్యత్తులో యూరియా దొరకదన్న భయంతో ఖరీఫ్‌తోపాటు, రబీకి కోసం కూడా రైతులు యూరియా తీసుకునేందుకు ఎగబడుతున్నారని అన్నారు. రైతుల అవసరాల మేరకు ప్రభుత్వం యూరియాను సిద్ధంగా ఉంచుతోందని తెలిపారు. ఎప్పటికప్పుడు సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మాట్లాడిందని, త్వరలో 50 వేల మెట్రిక్ టన్నులు యూరియా వస్తుందని తెలిపారు. రబీకి సైతం మరో లక్ష మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని అన్నారు. పంజాబ్‌లో యూరియా ఎక్కువగా వాడటం వల్ల చాలా వరకూ క్యాన్సర్ వచ్చిందని అన్నారు. అందుకే శాస్త్రవేత్తలు కూడా యూరియా వాడకాన్ని తగ్గించాలని సూచిస్తున్నారని, రైతులు పాటించాలని మంత్రి విన్నవించారు.

వీఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించాలి

విజయవాడ (గాంధీనగర్), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్వోలు తీవ్ర పని ఒత్తిడి గురవుతున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్ రవీంద్రరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మిని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం కలిసిన వారు వీఆర్వోల సమస్యలను ఆమెకు వివరించారు.

కూలి బతుకుల్లో కన్నీళ్లు

- కూలీల ఆటో బోల్తా... ఇద్దరు మృతి
- బాధితులంతా కడప జిల్లావాసులు

(వివరాలు 8లో)

సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): డిగ్రీ కాలేజీలకు ఫీజుల బకాయిలు, ఇతర సమస్యలను పది రోజుల్లో పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని ప్రైవేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాల సంఘాలు ప్రకటించాయి. రెండు ప్రధాన సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.రమణాజీ, సి.విజయభాస్కర్ రెడ్డి, పి.జయరాం, పి.పెద్దిరాజు మంగళవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా డిగ్రీ కోర్సులకు కొత్త ఫీజులు ఖరారు చేయాలని, ఫీజులు నిర్ణయించే అధికారం యూనివర్సిటీల పరిధిలోకి మార్చాలని డిమాండ్ చేశారు.



స్వాగతం - సుస్వాగతం
సూపర్ సిక్స్
సూపర్ హిట్
బాబు సూపర్ 6
విజయోత్సవ బహిరంగ సభకు
విచ్చేస్తున్న మన ప్రియతమ ముఖ్యమంత్రి వర్యులు
గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
ఉప ముఖ్యమంత్రివర్యులు
గౌ॥ శ్రీ పవన్ కళ్యాణ్ గారికి
యువగళం రథసారథి
గౌ॥ శ్రీ నారా లోకేష్ గారికి
రాష్ట్ర మంత్రులకు,
కూటమి ఎం.ఎల్.సి.లు,
ఎం.ఎల్.ఎ.లు
కార్పొరేషన్ ఛైర్మెన్లకు,
స్వాగతం – సుస్వాగతం
సూపర్ హిట్ విజయోత్సవ సభను
విజయవంతం చేద్దాం
కదలి రండి...! తరలి రండి....!
23వ ఆంధ్రజ్యోతి వార్షికోత్సవ శుభాకాంక్షలు
వేదిక
ఇంద్రప్రస్థ గ్రౌండ్, 80 అడుగుల రోడ్డు, అయ్యప్ప స్వామి గుడి దగ్గర,
అనంతపురం, తేది: 10.09.2025 బుధవారం : మ॥ 1:00 గం॥కు
డా॥ ఉమర్ ముక్తార్
S/o డి.చమన్ సాబ్
ఛైర్మెన్ : చమన్ సాబ్ ఫౌండేషన్, టీడీపీ యువ నాయకులు, అనంతపురం.


"సూపర్‌సిక్స్ - సూపర్ హిట్"
విజయోత్సవానికి స్వాగతం – సుస్వాగతం
బాబు సూపర్ 6
23వ ఆంధ్రజ్యోతి వార్షికోత్సవ శుభాకాంక్షలు
ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఏడాది కాలంలోనే
అమలు చేసి అభివృద్ధి - సంక్షేమాన్ని
సమపాలలో రంగరించి రాష్ట్రాన్ని అన్నిరంగాలలో
అభివృద్ధి పథంలో నడిపిస్తూ... దేశానికే రాష్ట్రాన్ని
రోల్ మోడల్‌గా నిలిపి నేడు అనంతపురంలో జరుగుచున్న
"సూపర్ సిక్స్ - సూపర్ హిట్"
విజయోత్సవ సభకు విచ్చేస్తున్న ఆంధ్రరాష్ట్ర దార్శనికుడు, అభివృద్ధి ప్రదాత
గౌరవ ముఖ్యమంత్రి వర్యులు
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారికి
మంత్రి వర్యులు శ్రీ నారా లోకేష్ గారికి
రాష్ట్ర మంత్రులకు, M.P, MLA లకు, కూటమి పార్టీ కుటుంబసభ్యులకు
మా హృదయపూర్వక స్వాగత సుమాంజలులు.
అమిలినేని సురేంద్రబాబు
శాసనసభ్యులు
కళ్యాణదుర్గం నియోజకవర్గం


స్వాగతం - సుస్వాగతం
సూపర్ సిక్స్ సూపర్ హిట్
కార్యక్రమ విజయోత్సవానికి విచ్చేయుచున్న మన ప్రియతమ ముఖ్యమంత్రి
గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
ఉప ముఖ్యమంత్రివర్యులు
గౌ॥ శ్రీ పవన్ కళ్యాణ్ గారికి
యువగళం రథ సారథి
గౌ॥ శ్రీ నారా లోకేష్ గారికి
రాష్ట్ర మంత్రులకు, కూటమి శాసనసభ్యులకు
మరియు కూటమి నాయకులు, కార్యకర్తలకు
స్వాగతం - సుస్వాగతం
బాబు సూపర్ 6
దండు శ్రీనివాసులు
మార్కెట్ యార్డ్ ఛైర్మన్, శింగనమల
తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి


స్వాగతం - సుస్వాగతం
సూపర్ సిక్స్
23వ ఆంధ్రజ్యోతికి
సూపర్ హిట్
కార్యక్రమ విజయోత్సవానికి విచ్చేయుచున్న
మన ప్రియతమ ముఖ్యమంత్రి
గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
ఉప ముఖ్యమంత్రివర్యులు
గౌ॥ శ్రీ పవన్ కళ్యాణ్ గారికి
యువగళం రథ సారథి
గౌ॥ శ్రీ నారా లోకేష్ గారికి
రాష్ట్ర మంత్రులకు,
రాష్ట్ర కూటమి శాసనసభ్యులకు
మరియు కూటమి కార్యకర్తలకు
స్వాగతం - సుస్వాగతం
బాబు సూపర్ 6
ఎస్.కె.మస్తాన్‌వలి
తెలుగుదేశం నాయకులు
కొర్తికోట, తనకల్లు (మం)
శ్రీ సత్యసాయి జిల్లా


స్వాగతం - సుస్వాగతం
బాబు సూపర్ 6
బాబు ష్యూరిటీ
సంక్షేమం
బాబు సూపర్ 6
అభివృద్ధి
భవిష్యత్తు గ్యారెంటీ
సూపర్ సిక్స్
సూపర్ హిట్
ముంటిమడుగు కేశవరెడ్డి
చైర్మన్, ఎ.డి.సి.సి. బ్యాంక్
ఆలం నరసానాయుడు
టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి
శ్రీధర్‌చౌదరి
టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి
కె.రామలింగారెడ్డి
టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి
విజయోత్సవ బహిరంగ సభకు విచ్చేస్తున్న
మన ప్రియతమ ముఖ్యమంత్రి వర్యులు
గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
ఉప ముఖ్యమంత్రివర్యులు
గౌ॥ శ్రీ పవన్ కళ్యాణ్ గారికి
యువగళం రథసారథి
గౌ॥ శ్రీ నారా లోకేష్ గారికి
రాష్ట్ర మంత్రులకు, కూటమి ఎం.ఎల్.సి.లు,
ఎం.ఎల్.ఎ.లు కార్పొరేషన్ చైర్మెన్లకు,
స్వాగతం - సుస్వాగతం
సూపర్ హిట్ విజయోత్సవ సభను
విజయవంతం చేద్దాం కదలి రండి...!
తరలి రండి....!
23వ ఆంధ్రజ్యోతి వార్షికోత్సవ శుభాకాంక్షలు
వేదిక : ఇంద్రప్రస్థ గ్రౌండ్, 80 అడుగుల రోడ్డు, అయ్యప్ప స్వామి గుడి దగ్గర, అనంతపురం, తేది: 10.09.2025 బుధవారం : మ॥ 1:00 గం॥కు



నేడు బడులకు సెలవు

కొత్తచెరువు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు బుధవారం సెలవు ప్రకటించినట్లు డీఈఓ కిష్టప్ప ప్రకటనలో తెలిపారు. అనంతపురంలో నిర్వహించే సీఎం చంద్రబాబునాయుడు సభకు ఏపీఎస్ఆర్టీసీ బస్సులు వెళ్తుండటంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున బడులకు సెలవు ప్రకటించామన్నారు. ఈనెల 13న రెండో శనివారం పాఠశాలలకు పనిదినంగా ప్రకటించామన్నారు. విషయాన్ని ఎంఈఓలు, హెచ్ఎంలు గమనించాలని ఆయన సూచించారు.

రైతులు ఏరీ..?

కర్షకుల్లేని వైసీపీ 'అన్నదాత పోరు'

- ర్యాలీల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలే
- ఆర్డీఓలకు వినతిపత్రాలు అందజేత
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి
- ప్రభుత్వంపై నాయకుల తీవ్ర విమర్శలు



ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వైసీపీ నాయకులు

అనంతపురం కలెక్టరేట్/పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతాంగ సమస్యలపై వైసీపీ చేపట్టిన నిరసన ర్యాలీ రైతుల్లేకుండానే సాగింది. అన్నదాతలు రాకుండానే మంగళవారం ర్యాలీ చేసి ఉమ్మడి జిల్లాలో ఆర్డీఓలకు వినతిపత్రాలు అందజేశారు. ర్యాలీలోనూ, వినతిపత్రాలు అందజేసే సమయంలోనూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు మాత్రమే కనిపించారు. దీంతో రైతులు లేకుండా పార్టీ శ్రేణులతో పోరాటాలు చేస్తే సమస్యలు పరిష్కారమవుతాయా..?అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ తన మనుగడ కోసమే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అందరూ వారే...

అనంతపురం నగరంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి నేతృత్వంలో శింగనమల, రాప్తాడు, తాడిపత్రి నియోజకవర్గాల ఇన్చార్జ్‌లు సాకే శైలజానాథ్, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పెద్దారెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి క్లాక్‌టవర్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కేశవనాయుడుకు వినతిపత్రం అందజేశారు. కళ్యాణదుర్గం పట్టణంలో మాజీ ఎంపీ, తలారి రంగయ్య, మెట్టుగోవిందరెడ్డి ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆర్డీఓ వసంతబాబుకు వినతిపత్రం అందజేశారు. గుంతకల్లులో వై.వెంకటామిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ చేసి ఆర్డీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఇక్కడా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వైసీపీ కార్యకర్తలే ఉండటం గమనార్హం.

వ్యవసాయానికి చంద్రబాబు చీడ...

రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి చంద్రబాబు రూపంలో తెగులు పట్టుకుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. 15నెలలుగా రైతులు కష్టాల్లో కూరుకుపోయారన్నారు. వారి మొర ఆలకించేవారే కరువయ్యారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి యూరియాను బ్లాక్‌మార్కెట్‌కు తరలించడం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైందన్నారు. జిల్లాలో గత ఏడాది ఖరీఫ్, రబీకి సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా అందించాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవాను (మిగతా 8లో..)

సభోత్సాహం..!

ఎటుచూసినా సూపర్ సిక్స్ సందడి

అన్నిదారులు అనంత వైపే..!

- పల్లె, పట్నం నుంచి తరలనున్న జనం
- జిల్లా నుంచి సభకు లక్షన్నర మంది
- మహిళలే అధికం



కియ వద్ద భోజన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సవిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప



అనంతపురంలో సభా వేదిక



సభా వేదిక వద్ద మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్, సవిత

పుట్టపర్తి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పల్లె, పట్నం అన్న తేడాలేకుండా అంతటా ఒకటే సందడి. ఒకటే ఉత్సాహం. అదే సభోత్సాహం. కూటమి ప్రభుత్వం అనంతపురంలో బుధవారం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న సూపర్ సిక్స్. సూపర్ హిట్ సభపైనే అంతటా చర్చ. సభకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోపాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన నేతలు హాజరుకానున్నారు. దీంతో సభకు వెళ్లేందుకు అందరూ సమాయత్తమయ్యారు. దీంతో బుధవారం అన్నిదారులు అనంత వైపే వెళ్లనున్నాయి. జిల్లా నుంచి ఏకంగా లక్షన్నర మంది వెళ్లనున్నట్లు తెలుస్తోంది. వారిలో కూడా మహిళలే అధికంగా ఉండనున్నారని సమాచారం. ఆ ఏర్పాట్లలో అందరూ మంగళవారం తలమునకలయ్యారు.

ప్రజాపాలనలో సక్సెస్

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక 15 నెలల్లో అభివృద్ధి, సంక్షేమంతో పాలనను పరుగులు పెట్టిస్తోంది. సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. అందులో భాగంగా పింఛన్ సొమ్ము పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం, అన్నదాత సఖీసభ, చదువుకునే పిల్లలందరికీ తల్లికి వందనం తోపాటు మెగా డీఎస్సీతో జిల్లాలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీని నెరవేర్చారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామివాడ నిర్మాణం చేపట్టే దిశగా భూసేకరణ చేపట్టారు. ఈ నేపథ్యంలో 15 నెలల్లోనే జిల్లాలో అన్ని రంగాల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. జిల్లాలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకంతోపాటు చిన్న, మధ్యతరహా, భారీ సాగునీటి ప్రాజెక్టులపై గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. కూటమి అధికారం చేపట్టిన మరుక్షణమే సాగునీటి ప్రాజెక్టులను పరుగులు పెట్టించారు. హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులకు నీరు ఇచ్చే జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పుంగనూరు కాలువ గట్టుకు ఇరువైపులా రూ.1198 కోట్లతో వందరోజుల్లో 230 కిలోమీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేశారు. కాలువలో నీరు వదిలి చెరువులను నింపుతున్నారు. ఎన్నికల్లో చేనేతలకు ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీని ప్రభుత్వం నిలబెట్టుకుంది. జిల్లాలో వ్యవసాయం తరువాత అత్యధికంగా జీవనోపాధినిస్తున్న చేనేత రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఊపిరి పోసింది. చేనేత కార్మికుల గృహాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తూ.. కార్మికుల్లో ఆనందం నింపింది. ఇలా జిల్లాలో సమపాళ్లలో అందించిన అభివృద్ధి సంక్షేమంతో ప్రజాపాలన సూపర్ హిట్ అయింది.

అన్ని దారులు అటే..

అనంతపురంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభకు తరలి వెళ్లేందుకు జిల్లా నుంచి ఏర్పాట్లు చేసుకున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నేతలు, శ్రేణులు ప్రతి పల్లెపట్నం నుంచి తరలి వెళ్లనున్నారు. సభ సమీపంలో రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల నుంచి భారీ జన సమీకరణ చేస్తున్నారు. పెనుకొండ, హిందూపురం, పుట్టపర్తి, మడకశిర, కదిరి నియోజక వర్గాల నుంచి వేలాదిమంది తరలించే ఏర్పాట్లు చేసుకున్నారు. సభకు మహిళలు భారీగా తరలిరానున్నారు. జిల్లా నుంచి లక్షన్నర మంది సభకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేసుకున్నారు. నియోజకవర్గాల వారీగా జిల్లాకు 1,270 ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు ఏర్పాటు చేశారు. వేలాది కార్లు, ద్విచక్ర వాహనాల్లో సభకు హాజరుకానున్నారు. ప్రజాపాలనలో 15 నెలల్లో సాధించిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలపై సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభను విజయవంతం చేయడానికి జిల్లాలో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీ నేతలు సమాయత్తమయ్యారు.

ఒక్క చెట్టు నరకకుండానే...

- సూపర్‌సిక్స్- సూపర్‌హిట్ సభ నిర్వహణ
- బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఒక్క చెట్టు నరకకుండా, ఒక్క పరదా వేయకుండా, ఒక్క దుకాణం మూసి వేయకుండా సూపర్‌సిక్స్- సూపర్ హిట్ సభను నిర్వహిస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మండలంలోని కియ పరిశ్రమ ఎదురుగా పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల నుంచి వచ్చే కార్యకర్తలు, నాయకులు, ప్రజలకు భోజన వసతి కార్యక్రమాలను మంత్రి సవిత మంగళవారం పరిశీలించారు. ఆమె వెంట మంత్రి గుమ్మడి సంధ్యారాణి, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి జోత్స్న, విప్ అంజనేయులు, నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు ఉండి ఏర్పాట్లు పరిశీలించారు. మంత్రి సవిత మాట్లాడుతూ సీఎం బహిరంగసభకు దాదాపు 5లక్షల మంది దాకా రానున్నట్లు తెలిపారు. సాగు, తాగునీరు, పరిశ్రమలు, ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్, అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ తదితరవాటిని ఉమ్మడి జిల్లాకు తెచ్చిన ఘనత సీఎం చంద్రబాబుదే అన్నారు. జిల్లాకు మరిన్ని పరిశ్రమలు బహిరంగసభలో ముఖ్యమంత్రి ప్రకటిస్తారనే ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, కేశవయ్య, మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, గుట్టూరు సూరి, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, మీసేవ షమీ, మావటూరు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

40వేల మందికి భోజనం

సూపర్‌సిక్స్- సూపర్‌హిట్ బహిరంగ సభకు అనంతపురం వెళ్లే ప్రజలు దాదాపు 40వేల మందికి భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి సవిత పేర్కొన్నారు. కియ ఎదురుగా ఆరు భోజన కౌంటర్లను ఏర్పాటు చేశారు. వాటిని పరిశీలించిన అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ హిందూపురం, మడకశిర, పెనుకొండ డివిజన్ల నుంచి వచ్చే నాయకులు, కార్యకర్తలకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు భోజనం అందుబాటులో ఉంటుందన్నారు.

ఖననం.. గగనం..!

- శ్మశాన వాటిక లేక ఆఖరి మజిలీకి అవస్థలు
- రోడ్డు పక్కన, కాలువల్లో పూడ్చుకుంటున్న వైనం
- వినతులను పట్టించుకోని అధికారులు



ముదిగుబ్బ వద్ద వంకలో సమాధులు

ముదిగుబ్బ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముదిగుబ్బలో మరణించిన వారికి అంతిమ సంస్కారాలు నిర్వహించడం గగనమవుతోంది. కుటుంబ సభ్యుల జ్ఞాపకంగా సమాధులు కట్టుకోవడానికి స్థలం లేని దుస్థితి నెలకొంది. వాగుల్లో, వంకల్లో, దారి పక్కన అంత్యక్రియలు నిర్వహించుకోవాల్సిన దయనీయ పరిస్థితి నెలకొందని ముదిగుబ్బ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 20వేల జనాభా కలిగిన మండల కేంద్రంలో హిందూ శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని దశాబ్దాలుగా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు అధికారులను కోరుతున్నా పట్టించుకోలేదు. గత ఆగస్టు నెలలో సీపీఎం ఆధ్వర్యంలో దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అధికారులు పట్టించుకోలేదని ప్రజా సంఘాల నాయకులు మండిపడుతున్నారు. మండల కేంద్రానికి నాలుగు వైపులా వాగులు, వంకలు, రహదారి పక్కన అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. వాగు పరివాహక ప్రాంతాల్లో కట్టిన సమాధులు భారీ వర్షాల ధాటికి కొట్టుకుపోతున్నాయి. పెద్దల పండుగ రోజు.. ఏడాదికి ఒకసారి సమాధుల వద్ద కొబ్బరికాయ కొట్టి వారి జ్ఞాపకాలను తలచుకొనే అవకాశాన్ని కోల్పోతున్నారు. 2021లో కురిసిన భారీ వర్షాలతో వచ్చిన వరద ధాటికి పాత ఊళ్లోని ఇసుక వంకలో వందల సమాధులు కొట్టుకుపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని ముదిగుబ్బ ప్రజలు కోరుతున్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి



మండల కేంద్రమైన ముదిగుబ్బలో శ్మశానవాటిక కోసం సరైన స్థలం లేక వాగులు, వంకల్లో ఖననం చేసే పరిస్థితి నెలకొంది. అధికారులు, ప్రజా ప్రతినిధులకు దశాబ్దాల కాలం నుంచి విన్నవించినా పట్టించుకోలేదు. ముదిగుబ్బ వద్ద శ్మశాన వాటికకు స్థలం కేటాయించి, ప్రహరీ నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలి.

- ఎ.వెంకటనాయుడు, ముదిగుబ్బ

సమస్యను పరిష్కరిస్తాం

శ్మశానవాటిక కోసం స్థలం కేటాయించాలని పలుమార్లు నా దృష్టికి తెచ్చారు. మూడుచోట్ల ప్రభుత్వ స్థలాలు పరిశీలించాం. సరైన స్థలాన్ని ఎంపిక చేసి సమస్యను పరిష్కరిస్తాం.

-నారాయణస్వామి, తహసీల్దార్

విద్యార్థులను పరిశోధనల వైపు

ప్రోత్సహించాలి

ఉపాధ్యాయులకు ఏడీ సూచన



ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ లాజర్

కొత్తచెరువు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని పెంపొందించి, పరిశోధనల వైపు అడుగులు వేసేలా ఉపాధ్యాయులు బోధించాలని విద్యాశాఖ ఏడీ లాజర్ సూచించారు. ఇన్‌స్పైర్, స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌పై ప్రభుత్వ పాఠశాలల టీచర్లకు రెండురోజులుగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. కదిరిలో మంగళవారం ఏర్పాటు చేసిన ముగింపు సభకు పెనుకొండ ఉపవిద్యాశాఖాధికారి జాన్‌రెడ్డెప్ప, విద్యాశాఖ ఏడీ లాజర్ హాజరయ్యారు. ఏడీ లాజర్ మాట్లాడుతూ.. ఇన్‌స్పైర్, స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌పై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. అప్పుడే వారిలో పరిశోధనలు, ప్రయోగాలపై ఆసక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ఈనెల 15లోగా ఇన్‌స్పైర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మీ, చిన్నికృష్ణ, ఓబుళరెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నాలుగు దశల్లో

స్థానిక ఎన్నికలు

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని (8లో....)

వీడిన వైసీపీ గ్రహణం

- సీజీ ప్రాజెక్టుకు మహర్దశ
- రూ.32 లక్షలతో అభివృద్ధి పనులు
- పూడికతీత, కంపచెట్ల తొలగింపు ప్రారంభం
- ఆయకట్టుదారుల్లో ఆనందం





ప్రాజెక్టు కట్ట, కుడి, ఎడమ కాలువల్లోని కంపలను తొలగిస్తున్నారు.

తనకల్లు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల చరిత్ర కలిగిన సీజీ ప్రాజెక్టుపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించింది. ప్రాజెక్టు కట్టపై లైట్లు కూడా ఏర్పాటు చయలేదు. కాలువల్లో కంపచెట్లు తొలగించలేదు. చిన్నచిన్న మరమ్మతులు కూడా చేయలేదు. ఐదేళ్లు గాలికొదిలేశారు. ప్రాజెక్టు నిండినా.. నీరు పారక రైతులు ఆయకట్టు భూములను బీళ్లుగా వదిలేశారు. నీరున్నా.. ఈ దుస్థితి ఏంటని అన్నదాతలు తీవ్ర ఆవేదన చెందారు. కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే సీజీ ప్రాజెక్టు అభివృద్ధికి చర్యలు చేపట్టింది. నిధులిచ్చి.. అభివృద్ధి పనులు చేపట్టింది. ఐదేళ్ల తరువాత కాలువల్లో పూడికతీత, కంపచెట్ల తొలగింపు పనులు చేస్తుండడంతో ఇక.. నీళ్లొస్తాయనీ, పంటలు పండించుకుంటామని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

1200 ఎకరాల ఆయకట్టు

మండలంలోని ముండ్లవారిపల్లి వద్ద 1958లోనే సీజీ (చెన్నరాయస్వామి గుడి) ప్రాజెక్టును నిర్మించారు. దాదాపు 0.75 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో పాపాఘ్ని నదిపై ఆనకట్ట కట్టారు. ప్రాజెక్టు ఎడమ కాలువ కింద 900, కుడి కాలువ కింద 300 ఎకరాల ఆయకట్టు ఉంది. మరో 300 ఎకరాలకు కూడా నీరందుతుంది. దశాబ్దాలుగా ఆయకట్టులో పంటలు పెట్టుకుంటున్నారు. వైసీపీ పాలనలో ప్రాజెక్టుపై తీవ్ర నిర్లక్ష్యం చేశారు. కాలువల్లో కంపచెట్లు పెరిగిపోయినా తొలగించలేదు. ప్రాజెక్టు కట్ట కూడా కంపలతో నిండిపోయి ఉండేది. ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన లైట్లు కూడా వెలగని దుస్థితి. ప్రాజెక్టు నిండినపుడు సంబంధిత ఇంజనీర్ బయప్ప.. పక్క గ్రామాల నుంచి కూలీలను పిలిపించుకుని, సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో గేట్లు ఎత్తాల్సి వచ్చేది. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టు అభివృద్ధి కోసం పైసా మంజూరు చేసిన పాపాన పోలేదు. దీంతో రైతులు.. ఆయకట్టు భూములను బీళ్లుగా వదిలేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే.. సీజీ ప్రాజెక్టు అభివృద్ధికి రూ.32 లక్షల నిధులను మంజూరు చేసింది. ఆ మేరకు టెండర్లు నిర్వహించారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇటీవలే పనులు ప్రారంభించారు. దీంతో సీజీ ప్రాజెక్టుకు మహర్దశ పట్టినట్లు సాగుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కాలువల్లో పూడిక తీసి, చివరి ఆయకట్టుకు కూడా నీరు అందేలా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. కాలువల్లో పూడికతీత పనులు పూర్తికాగానే తమ పొలాలను సాగు చేయడానికి అనుకూలంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్లూ పంటలు పెట్టలేకపోయాం



ప్రాజెక్టులో నీరున్నా. గత ఐదేళ్లలో ఆయకట్టులో పంట లు సాగు చేయలేకపోయాం. మా కుటుంబాలకు ఉమ్మడి గా ఏడు ఎకరాల భూమి ఉంది. కాలువలు కంపలతో నిండిపోవడంతో పంటలు సాగుచేయలేక ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుత ప్రభుత్వం కంపలు తొలగించి, కాలువలో పూడికతీత పనులు చేపట్టడం ఆనందంగా ఉంది. ప్రాజెక్టు నిండిన వెంటనే పంటలు సాగుచేస్తాం.

-ఉమారాజా, రైతు, ఎగువతొట్లిపల్లి

ప్రాజెక్టుకు పూర్వ వైభవం



గతేడాది సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించినపుడు ప్రాజెక్టు పరిస్థితి చూసి బాధ కలిగింది. మా తాతల కాలం నుంచి ప్రాజెక్టు కింద ఆయకట్టులో పంటలు సాగు చేస్తున్నాం. వైసీపీ పాలనలో నీరున్నా, కంపలు, కాలువల మరమ్మతుల కారణంగా బీడుగా వదిలేయాల్సి వచ్చింది. కూటమి అధికారం చేపట్టిన ఏడాదిలోనే సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహించి, నిధులు మంజూరు చేయడం ఆనందంగా ఉంది.

-రామమోహన్, చైర్మన్, సాగునీటి సంఘం

చివరి ఆయకట్టుకు నీరు అందేలా చర్యలు



ప్రాజెక్టు కుడి కాలువ కింద 300, ఎడమ కాలువ కింద 900 ఎకరాలు భూములు సాగుకావాల్సి ఉంది. గత ఐదేళ్లలో కాలువల్లో పూడిక, కంపల కారణంగా నీరున్నా, సాగుచేయలేకపోయారు. ప్రస్తుత ప్రభుత్వం రూ.32 లక్షల నిధులు మంజూరు చేసింది. ప్రాజెక్టు కట్టపై విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తాం. కంపలు తొలగించి, పూడిక తీసి కాలువల చుట్టూ ఆక్రమణల్లో ఉన్న భూములను సర్వేలు నిర్వహిస్తాం. కాలువలపై రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నాం. చివరి ఆయకట్టుకు కూడా నీరు అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

-బయ్యప్ప, ఏఈ, మైనర్ ఇరిగేషన్


ఏర్పాట్లపై మంత్రుల సమాలోచనలు


మంత్రులు, నాయకుల చలోక్తులు


సభా వేదిక వద్ద మంత్రులు, నాయకులు


సీసీ టీవీ ఫుటేజీల ద్వారా పోలీసుల పర్యవేక్షణ


డ్రోన్ల ద్వారా పరిశీలన



మహా వేడుక

అనంతపురం క్రైం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): చారిత్రక ఘట్టానికి అనంతపురం సిద్ధమైంది. పది రోజుల వ్యవధిలో ఏకంగా 3.50 లక్షల మంది రాష్ట్ర ప్రజలను ఒక చోటకు చేర్చే మహాయజ్ఞం పూర్తి అయింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, మూడు పార్టీల నాయకులు నగరంలో తిష్ట వేసి.. చక చకా ఏర్పాట్లు చేయించారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఎన్నికలలో చాటిన ఐక్యతను హామీల అమలులో కొనసాగించారు. కేవలం 15 నెలల పాలనలో ప్రజలకు ఇచ్చిన ఆరు ప్రధాన హామీలను అమలు చేసి.. సగర్వంగా జనం ఎదుటకు వస్తున్నారు అగ్ర నాయకులు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, మూడు పార్టీల కీలక నాయకులు 'సూపర్ సిక్స్.. సూపర్ హిట్' సభకు వస్తున్నారు. ఈ వేడుకకు నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. జన తరంగాన్ని కలిపే మహా వేదిక శరవేగంగా రూపుదిద్దుకుంది. అధికారం చేపట్టింది మొదలు గడిచిన 15 నెలల్లో ఎదురైన సవాళ్లు, సాధించిన విజయాలను తమ అధినేతలు ప్రజలకు వివరిస్తుంటే చూడాలని మూడుపార్టీల శ్రేణులు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ భారీ బహిరంగ సభను బుధవారం నిర్వహిస్తున్నారు. అనంతపురం నగర శివారులోని శ్రీనగర్ కాలనీ జీఎంఆర్ ఇంద్రప్రస్థ గ్రౌండ్స్ ఇందుకు సిద్ధమైంది. మంత్రులు, మూడు పార్టీల ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రముఖ నాయకులు ఇప్పటికే అనంతపురం చేరుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎంపీలు, ఇతర అగ్రనాయకులు బుధవారం వస్తున్నారు. బహిరంగ సభ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ కొనసాగుతుంది.

ఇలా వెళ్లి.. అలా నిలపండి..

- ఉరవకొండ నియోజవర్గం నుంచి వచ్చే వాహనాలు కూడేరు మీదుగా బళ్లారి బైపాస్, తపోవనం సర్కిల్ నుంచి హైవే మీదుగా ప్రయాణించి.. విజయోత్సవ సభకు సమీపంలో కేటాయించి ప్రసన్నాయపల్లి, అయ్యవారిపల్లి రోడ్లలో పార్కింగ్ చేసుకోవాలి.
- రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల నుంచి వచ్చే వాహనాలు ఆత్మకూరు మీదుగా కళ్యాణదుర్గం బైపాస్ అండర్ పాస్, సర్వీస్ రోడ్డులో వచ్చి రవి పెట్రోల్ బంకు వద్ద హైవేలో ప్రవేశించి, సభ వద్దకు చేరుకుని, సమీపంలోని ప్రసన్నాయపల్లి, అయ్యవారిపల్లి రోడ్లలో పార్కింగ్ చేసుకోవాలి.
- గుత్తి, గుంతకల్లు వైపు నుంచి వచ్చే వాహనాలను గార్లదిన్నె మీదుగా హైవేపై సభ వద్దకు వచ్చి, ప్రసన్నాయపల్లి, అయ్యవారిపల్లి రోడ్లలో పార్కింగ్ చేయాలి.
- తాడిపత్రి నియోజవకర్గం నుంచి వచ్చే వాహనాలు నాయనపల్లి క్రాస్ మీదుగా 544-డి జాతీయ రహదారిపై ప్రవేశించి, వడియంపేట, నేషనల్ పార్కు వద్ద జాతీయ రహదారి 44లో ప్రవేశించి, సభ వద్దకు చేరుకుని.. ప్రసన్నాయపల్లి, అయ్యవారిపల్లి రోడ్లలో చేసుకోవాలి.
- శింగనమల నియోజవర్గం నుంచి వచ్చే వాహనాలు బుక్కరాయసముద్రం, చెరువుకట్టు, కలెక్టర్ కార్యాలయం, పంగల్ రోడ్డు, రాప్తాడు వై జంక్షన్ మీదుగా సభకు చేరుకోవాలి. సమీపంలోని కేటాయించిన ప్రసన్నాయపల్లి, అయ్యవారిపల్లి రోడ్లలో పార్కింగ్ చేయాలి.
- కదిరి, బత్తలపల్లి, ముదిగుబ్బ, తాడిమర్రి నుంచి వచ్చే వాహనాలు సేతు స్కూల్ సమీపంలో.. రాప్తాడు వై జంక్షన్ మీదుగా సభకు చేరుకోవాలి. వీళ్లు కూడా ప్రసన్నాయపల్లి, అయ్యవారిపల్లి రోడ్లలో పార్కింగ్ చేసుకోవాలి.


ఏర్పాట్లపై చర్చిస్తున్న మండిపల్లి, పూల నాగరాజు, కలెక్టర్

ఇబ్బందుల్లేకుండా సూపర్ హిట్ చేయాలి
- మంత్రి మండిపల్లి,
ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

అనంతపురం టౌన్(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న సూపర్ సిక్స్- సూపర్ హిట్ విజయోత్సవ సభకు హాజరయ్యే ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు ఆదేశించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం సాయంత్రం వారు కలెక్టర్ వినోద్‌కుమార్, టీడీపీ రాష్ట అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఇతర జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రజల రవాణా ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాలు, భోజన వసతి ఏర్పాట్లపై సమీక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలను సభకు చేర్చే ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు నిర్దేశిత పార్కింగ్ స్థలాల్లో ఉండేలా చూడాలన్నారు. అలాగే సభ ముగిసిన అనంతరం ప్రయాణికులను వారి స్వస్థలాలకు క్షేమంగా చేర్చేవరకు పర్యవేక్షించాలన్నారు.

సర్వం సిద్ధం

'కొడితే కొట్టాలిరా సిక్స్ కొట్టాలి.. పడితే పట్టాలి రా హిట్ పట్టాలి' అంటూ బుధవారం జరిగే సభకు సర్వం సిద్ధం చేశారు. సుమారు 50 ఎకరాల్లో భారీ బహిరంగ వేదిక, ప్రజలు కూర్చోడానికి గ్యాలరీలను ఏర్పాటు చేశారు. వేలాదిగా తరలివచ్చే వాహనాలకు పార్కింగ్ స్థలాలను సిద్ధం చేశారు. సభా ప్రాంగణంలో తాత్కాలిక విశ్రాంతి కోసం సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఇతర ప్రముఖులు కోసం మూడు భారీ టెంట్లు ఏర్పాటు చేశారు. సభాప్రాంగణంతోపాటు, సభాస్థలికి వెళ్లే రహదారులు, గ్యాలరీల్లో క్షణ క్షణం పర్యవేక్షించానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నగరంలో ట్రాఫిక్, శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా వేలాది మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వచ్చేశారు.. కీలక నాయకులు


టీడీపీ కూటమి నేతల పండుగ సూపర్ సిక్స్-సూపర్‌హిట్ సభలో పాల్గొనేందుకు అగ్రనాయకులు, అమాత్యులు ఇప్పటికే జిల్లాకు చేరుకున్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, నారాయణ, గొట్టిపాటి రవికుమార్, సవిత, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, సత్యప్రసాద్, మాజీ మంత్రులు, సుమారు 80 మంది వరకూ ఎమ్మెల్యేలు అనంతపురం చేరుకున్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. దీంతో నగరంలోని లాడ్జిలు, హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, కల్యాణ మండపాలు కిటకిటలాడుతున్నాయి.

సహకరించాలి: ఎస్పీ

సీఎం, డిప్యూటీ సీఎం, ప్రముఖల పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య లేకుండా అందరూ సహకరించాలని ఎస్పీ జగదీష్ కోరారు. వాహనదారులకు సూచించిన చోట పార్కింగ్ చేయాలని కోరారు. నగరంలోని పలు ప్రాంతాల్లో జిల్లా యంత్రాంగం పార్కింగ్ స్థలాలను సిద్ధం చేసింది. వివిధ ప్రాంతాల నుంచి అనంతపుర నగరానికి వచ్చే వేలాదిమంది వాహనదారులు వారికి కేటాయించిన ప్రాంతాల్లోనే పార్కింగ్ చేయాలని ఎస్పీ ఆదేశించారు.

నిఘా నీడలో నగరం

బహిరంగ సభకు లక్షలాది మంది తరలివస్తున్నందున పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. సీసీ కెమెరాలతో పర్యవేక్షించనుంది. మొత్తం 55 డ్రోన్ కెమెరాలతో సభ భద్రతను పర్యవేక్షిస్తారు. మరో 250 సీసీ కెమెరాలతో సభా ప్రాంగణంలో అనుక్షణం నిఘా పెట్టనున్నారు. వీటికితోడు మరో 400 సీసీ కెమెరాలతో నగరం మొత్తం నిఘా వేశారు. వేలాది మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు.



పవన్ కల్యాణ్ పర్యటన షెడ్యూల్ ఇదీ..

పుట్టపర్తి రూరల్/అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బుధవారం అనంతపురంలో నిర్వహించే సూపర్ సిక్స్. సూపర్ హిట్ సభకు హాజరుకానున్నారు. ఇందులో భాగంగా ఆయన ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని మాదాపూర్ నివాసం నుంచి బయల్దేరి 11.25కి శంషాబాద్ విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో 11.30కి బయలుదేరి మధ్యాహ్నం 12.30కి పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి హెలీకాప్టర్‌లో 12.40కి బయల్దేరతారు. అనంతపురం నగర పరిధిలోని కక్కలపల్లి హెలీప్యాడ్‌కు మధ్యాహ్నం ఒంటి గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 1.05కు సభావేదిక వద్దకు చేరుకుంటారు. 2.00 గంటలకు బహిరంగ సభలో పాల్గొంటారు. తిరిగి సాయంత్రం 4.35కి అక్కడి నుంచి బయల్దేరి హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 4.45కు హెలీక్యాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 5.10 సత్యసాయి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో 6.15కు గన్నవరం చేరుకుంటారు. 6.20కి మంగళగిరి క్యాంపు కార్యాలయానికి బయలుదేరుతారు. రాత్రి 7.00 గంటలకు క్యాంపు కార్యాలయం చేరుకుంటారు.

సూపర్‌సిక్స్ సభను విజయవంతం చేస్తాం: ఎమ్మెల్యే

శింగనమల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో జరిగే సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురంలోని ఎమ్మెల్యే స్వగృహంలో రాష్ట్ర మంత్రులు నారాయణ, టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, రాంప్రసాద్‌రెడ్డితో సభ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి మహిళలను భారీ ఎత్తున తరలించాలని ఎమ్మెల్యేకి సూచిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సభను సూపర్ హిట్ చేసి చూపుతామని తెలిపారు. నియోజకవర్గం నుంచి 350 బస్సులను ఏర్పాటు చేశామని, ఆరు మండలాల నుంచి మహిళలు, కార్యకర్తలు, ప్రజలను తరలించడానికి సిద్ధం చేశామని వివరించారు. కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ బాబ్జి, ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ముంటిమడగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మంత్రులతో సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

సభకు వైసీపీ వాళ్లూ వస్తారు..

చంద్రబాబు పథకాలపై వారు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు: ఎమ్మెల్యే పరిటాల సునీత

ఆత్మకూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం నిర్వహించే సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభకు టీడీపీ సానుభూతిపరులే కాకుండా సామాన్య ప్రజలు, వైసీపీ వాళ్లు కూడా వస్తారని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. సభ విజయవంతానికి నియోజకవర్గ పరిశీలకులు ఏపీ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మన్నే సుబ్బారెడ్డి, ఆదోని కృష్ణమ్మతో కలిసి మండల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సొంత మండలం నుంచే అధికంగా ప్రజలు తరలి వచ్చే అవకాశం ఉందన్నారు. ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు హామీలు ఇస్తే.. ఎలా అమలు చేస్తారంటూ వైసీపీ నేతలు హేళన చేశారన్నారు. ప్రస్తుతం హామీలన్నీ అమలు చేసి, అభినందన సభ నిర్వహిస్తుండడంతో వైసీపీ నాయకులు కొందరు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు. సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పరిటాల సునీత

ఎమ్మెల్యేల ఇళ్లలో విందు

అమిలినేని ఇంట అల్పాహారం..
దగ్గుపాటి ఇంట విందు భోజనం
సందడి చేసిన మంత్రులు, అగ్రనేతలు

అనంతపురం క్రైం, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): అనంతపురం, కళ్యాణదుర్గం ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు ఇళ్లలో సందడే సందడి. సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభకు వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అగ్రనాయకులు మంగళవారం ఎమ్మెల్యేల ఇళ్లకు క్యూ కట్టారు. వారికి ఎమ్మెల్యేల ఇళ్లలో వేర్వేరుగా విందు ఇచ్చారు. ఉదయం అమిలినేని అల్పాహార విందు ఇచ్చారు. శ్రీనగర్‌కాలనీలోని తన గృహం (బృందావనం)లో మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, వంగలపూడి అనిత, సవిత, సత్యకుమార్, రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, కిలారి రాజేష్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఏలూరు సాంబశివారెడ్డి, అరని శ్రీనివాసులు, అమర్‌నాథ్ రెడ్డి, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి, ఎంఎస్ రాజు తదితరులకు అల్పాహార విందు ఇచ్చారు.

దగ్గుపాటి విందు భోజనం

అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తన ఇంటి వద్ద ప్రముఖులకు మధ్యాహ్నం విందు ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్, టీజీ భరత్, అచ్చెన్నాయుడు, నారాయణ, గొట్టిపాటి రవి, రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూర, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, శాప్ ఛైర్మన్ రవినాయుడు ఇతర ప్రముఖులు విందుకు హాజరయ్యారు. తర్వాత ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై అధ్యక్షులు, మంత్రులు, ఎమ్మెల్యేలు చర్చించారు.


అల్పాహార విందు ఇస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


మధ్యాహ్నం విందు ఇస్తున్న అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి

'పల్లె' నివాసానికి కూటమి నాయకులు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు రోడ్డునందుగల మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఇంటికి పలువురు కూటమి నేతలు వెళ్లారు. వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, వ్యవసాయ శాఖ మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యే రాధాకృష్ణ తదితరులు మాజీ మంత్రి ఇంటికి వెళ్లారు. ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, శ్రీబాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె కిశోర్ వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి ఆహ్వానం పలికారు. గత కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిని పరామర్శించారు. ఆరోగ్యంపై ఆరాతీశారు.


పల్లె కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ వ్యవసాయ శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు స్వాగతం పలుకుతున్న కొనకొండ్ల రాజేష్, నాయకులు

సూపర్‌హిట్ సభకు బీజేపీ రాష్ట్ర నేతలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిప సూపర్ సిక్స్- సూపర్‌హిట్ సభకు బీజేపీ రాష్ట్ర నేతలు హాజరుకానున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, విష్ణుకుమార్ రాజు, ఈశ్వర్‌లతో పాటు రాష్ట్ర నేతలు హాజరుకానున్నారు. ఇప్పటికే నగరానికి చేరుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ స్వాగతం పలికారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీజేపీ నేతలు, శ్రేణులు భారీ సంఖ్యలో హాజరవుతారని జిల్లా అధ్యక్షుడు తెలిపారు.

జగన్.. నీకు సిగ్గుందా..?

ప్రతిపక్ష హోదా అడుక్కునేది కాదు..
ప్రజలు ఇచ్చేది
ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఫైర్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే.. అసెంబ్లీకి వస్తానంటున్న నీకు సిగ్గుందా..?' అంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఫైరయ్యారు. ఆయన మంగళవారం నగరంలోని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఇంటి వద్ద మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్ష హోదా అడుక్కునేది కాదనీ, ప్రజలు ఇచ్చేదన్నారు. చంద్రబాబునాయుడు ఇచ్చేది కాదన్నారు. ప్రస్తుతం డైరెక్టర్ పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రిని అడిగి అయినా.. జగన్‌కు కావాలంటే ఆ పోస్టు ఇప్పిస్తామంటూ రాజు ఎద్దేవా చేశారు. ఇప్పటికే అన్నీ ఫిల్ చేశామనీ, జగన్ దరఖాస్తు చేసుకుంటే డైరెక్టర్ పోస్టు ఇస్తామన్నారు. రాయలసీమ గడ్డపైనే పుట్టి ఉండుంటే... జగన్ అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. జగన్ ఆత్మగౌరవానికి ఏమాత్రం భంగం కలిగించమనీ, దమ్ము, ధైర్యం ఉంటే... అసెంబ్లీకి రావాలన్నారు. టీడీపీ, కూటమి ప్రభుత్వం, సూపర్ సిక్స్ పథకాలపై జగన్ ఎన్ని అబద్ధాలు చెప్పినా.. ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. మద్యం కేసులో ఎంతోమంది అనంతపురం జిల్లా నేతల పేర్లు కూడా వినిపిస్తున్నాయన్నారు. త్వరలో నిగ్గు తేలిస్తే... జిల్లాకు పట్టిన దరిద్రం పోతుందన్నారు.

విప్, ఎమ్మెల్యేలకు సన్మానం

అనంతపురం క్రైం, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభకు వచ్చిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే పరిటాల సునీతను కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సన్మానించారు. తన ఇంట్లో ఎమ్మెల్యే అమిలినేని.. వారికి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. తర్వాత విందు ఇచ్చారు.


సన్మానం చేస్తున్న అమిలినేని

కూలి బతుకుల్లో కన్నీళ్లు

కూలీల ఆటో బోల్తా... ఇద్దరు మృతి

నలుగురికి గాయాలు... బాధితులంతా కడప జిల్లావాసులు



ప్రమాదస్థలంలో చెల్లాచెదురుగా పడిన వస్తువులు, హేమలత, దేవనాథ్ మృతదేహాలు

తనకల్లు, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): కూలి చేసుకుని వెళ్తున్న కష్టజీవుల ప్రయాణం విషాదాంతమైంది. రోడ్డు ప్రమాదం వారిని కబళించింది. కుటుంబాల్లో కన్నీళ్లు నింపింది. మండలంలోని కొక్కంటి గ్రామ సమీపంలోని తుమ్మలవాండ్లపల్లి వద్ద మంగళవారం సాయంత్రం ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో కడప జిల్లా చక్రాయిపేట మండలం బురుజుపల్లికి చెందిన కూలీలు హేమలత (35), దేవనాథ్ (40) మృతిచెందారు. గంగులప్పకు తీవ్రగాయాలు కాగా, మరో ముగ్గురు గాయపడ్డారు. ఎస్ఐ గోపి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా చక్రాయిపేట మండలంలోని కొండప్పగారిపల్లి, ఆంజనేయపురం, బురుజుపల్లి గ్రామాలకు చెందిన 22 మంది కూలీలు మండలంలోని అగ్రహారం పల్లి వద్దకు టమోటా తొలగింపు పనులకు వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి ఆటోలో బయల్దేరారు. తుమ్మలవాండ్లపల్లి సమీపాన ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా బోల్తాపడింది. గాయపడిన వారిని తనకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హేమలత (35), దేవనాథ్ (40) మృతిచెందారు. మరో నలుగురు చికిత్స పొందుతున్నారు. ప్రమాదంపై కేసు నమోదుచేసుకుని, శవాలను కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళతోనే కుటుంబం బలోపేతం

- జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



మాట్లాడుతున్న జడ్పీచైర్‌పర్సన్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మహిళతోనే కుటుంబం బలోపేతం అవుతుందని, స్త్రీలు బలంగా ఉంటే సమాజం కూడా పటిష్ఠంగా ఉంటుందని జడ్పీ చైర్‌పరసన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. మహిళా స్నేహపూర్వక గ్రామాలు, థీం-9 శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక డీపీఆర్సీ సమావేశ భవనంలో చేపట్టారు. సమావేశానికి గిరిజమ్మ, జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య హాజరై మాట్లాడారు. జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ మహిళలకు భద్రత, గౌరవం, ఆర్థిక స్వావలంబన, సమాన అవకాశాలు కల్పించడం, విద్య దిశగా ప్రోత్సహించడం, స్వయం సహాయ సంఘాల బలోపేతం, గ్రామ స్థాయిలో పథకాలు అమలు చేయడం ద్వారా మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ శిక్షణలో డీడీఓ, పలువురు మహిళా సర్పంచులు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జనసేనలోకి పలువురి చేరిక



జనసేనలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ సిద్ధాంతాలకు ఆకర్షితులై శింగనమల నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ సమక్షంలో జనసేనలో చేరారు. వారికి ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, టీసీ వరుణ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతి కోసం పనిచేసేవారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు శ్రీనివాసులు, శ్రీధర్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, సీనియర్ నాయకులు లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

చెత్తకుప్పలో ఆధార్ కార్డులు



పూలచెర్లలో చెత్తకుప్పలో ఉన్న ఆధార్ కార్డులు

కణేకల్లు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలచెర్ల గ్రామంలో చెత్తకుప్పలో ఆధార్‌కార్డులు దొరికాయి. దాదాపు 50 నుంచి 60 ఆధార్‌కార్డులు ముళ్లకంపల మధ్యలో ఉన్న చెత్తకుప్పలో కనిపించగా వాటిని కొంతమంది ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఆధార్ కార్డులు ఎవరైనా ఇక్కడికి తెచ్చి పడేశారా? లేక పోస్టాఫీస్ ద్వారా వచ్చిన కార్డులను ప్రజలకు ఇవ్వకుండా పోస్టల్‌శాఖ వారు ఇక్కడ వేశారా అని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కొన్నేళ్లుగా గ్రామానికి ఆధార్‌కార్డులు గానీ, ఇతరత్ర సమాచార పత్రాలను పోస్టల్ శాఖ వారు ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పూర్తిగా విచారణ జరిపి చెత్తకుప్పలో ఉన్న ఆధార్‌కార్డుల విషయాన్ని నిగ్గుతేల్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కొండమ్మ, చంద్రికకు ఉద్యోగాలు

నాగమ్మను వెంటాడిన దురదృష్టం

డీఎస్సీ-2025లో ఎంపికపై ఉన్నతాధికారుల స్పష్టత



సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వచ్చిన డీఎస్సీ అభ్యర్థి కొండమ్మ

అనంతపురం విద్య, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): చిన్న పొరపాటుతో అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగానికి దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. డీఎస్సీ-2025కు ఎంపికైనా ఉద్యోగానికి దూరమవ్వాల్సిన పరిస్థితి. అదృష్టవశాత్తు ఇద్దరి ఉద్యోగానికి లైన్ క్లియర్ కాగా మరో అభ్యర్థికి మాత్రం నిరాశే మిగిలింది. అసలు ఏమి జరిగిందంటే...

కొండమ్మ, చంద్రిక, నాగమ్మ అనే అభ్యర్థులు డీఎస్సీ- 2025లో పీడీ (ఫిజికల్‌డైరెక్టరు) పోస్టులకు ఎంపికయ్యారు. ఈ ముగ్గురు కేజీబీవీలలో కాంట్రాక్ట్ ఉద్యోగం చేస్తూనే బీపెడ్(వ్యాయామ ఉపాధ్యాయ కోర్సు) చేశారని, అలా చేయడం నిబంధనలకు విరుద్ధమని ఫిర్యాదులు వచ్చాయి. దీంతో డీఈఓ ప్రసాద్‌బాబు, జిల్లా పరిశీలకులు జేడీ సుబ్బారావు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని ప్రత్యేకంగా సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించారు. 2014-15లో బీపెడ్ చేసినట్లు అందులో గుర్తించారు. ఆ తర్వాత సంబంధిత కేజీబీవీలకు సమాచారం పంపి అక్కడ వీరు ఎప్పటి నుంచి పనిచేస్తున్నారని నివేదికలు కోరారు. వారు 2013 నవంబరు నుంచి పని చేస్తున్నట్లు రికార్డుల ఆధారంగా గుర్తించారు. దీంతో కొండమ్మ, చంద్రిక, నాగమ్మ ఎంపిక జాబితాను పెం డింగ్‌లో ఉంచారు. కేజీబీవీలలో ఉద్యోగం చేస్తూ, ప్రభుత్వం నుంచి నెలవారి వేతనాలు తీసుకుంటూ కోర్సు చేయడం నిబంధనలకు విరుద్ధమని, అందుకే మీ ఎంపికను పెండింగ్ పెట్టినట్లు ఆ ముగ్గురికి తెలిపారు. దీంతో వారు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

యూజీ డీపెడ్‌తో అదృష్టం

అయితే 2013 జూన్ నెలలోనే కొండమ్మ, చంద్రిక పీఈటీ కోర్సుకు సంబంధించిన యూజీ డీపెడ్ పూర్తి చేశారు. 2013 నవంబరులో కేజీబీవీలలో సీఆర్టీగా చేరారు. దరఖాస్తు సమయంలోను ఈసర్టిఫికెట్లు అప్‌లోడ్ చేసి ఉన్నారు. దీంతో తాము ఉద్యోగంలో చేరకముందే పీఈటీ కోర్సు చేశాం కాబట్టి పీఈటీ పోస్టులైన ఇవ్వాలని విద్యాశాఖ ఉన్నతాధికారులను అడుగుతూ వచ్చారు. అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఓ అభ్యర్థి హైకోర్టును ఆశ్రయించారు. అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు రాష్ట్ర ఉన్నతాధికారులు దరఖాస్తులు, సర్టిఫికెట్లను పరిశీలించి కొండమ్మ, చంద్రిక పీడీ పోస్టుకు అనర్హులని, పీఈటీ పోస్టులకు మాత్రం అర్హులని తేల్చి ఉద్యోగం ఇవ్వడానికి అవకాశం కల్పించారు. ఆ మేరకు ఆదేశాలు రావడంతో మంగళవారం ఆ ఇద్దరిని డీఈఓ ఆఫీస్‌కు పిలిపించి కమిటీ సభ్యులతో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించారు.

పాపం నాగమ్మ..

అయితే డీఎస్సీ-2025లో మిగతా ఇద్దరితో పాటు ఎంపికైన నాగమ్మను మాత్రం దురదృష్టం వెంటాడింది. ఈమె కేజీబీవీలో పని చేస్తున్న సమయంలోనే బీపెడ్ చేశారు. మిగతా ఇద్దరు అభ్యర్థుల మాదిరి యుజీ డీపెడ్ చేయలేదు. దీంతో ఈమె ఎంపికను విద్యాశాఖ ఉన్నతాధికారులు తిరస్కరించారు. దీంతో ఆమె ఉసూరుమన్నారు.

హామీలన్నీ నెరవేర్చండి

-ముఖ్యమంత్రికి సీపీఐ లేఖ



లేఖను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చాలని సీఎం చంద్రబాబుకు సీపీఐ నేతలు విజ్ఞప్తి చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, ఇతర నేతలు హామీలను పరిష్కరించాలని ముఖ్యమంత్రికి రాసిన లేఖను మంగళవారం విడుదల చేశారు. ఈసందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ప్రజలకు వివిధ రకాల హామీలు ఇచ్చారన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం పెట్టినా కొన్ని బస్సులకే పరిమితం చేయడం సరికాదన్నారు. అలాగే అమ్మకు వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15వేలు ఇస్తామని, అందులో రెండువేలు కట్‌చేసి రూ.13వేలు చెల్లించడం దారుణమన్నారు. రైతులకు ఏడాదికి రూ.20వేలు ఇస్తామని చెప్పి, రూ.ఏడు వేలే ఇవ్వడం మోసం చేయడమేనన్నారు. 18ఏళ్ల నుంచి 59 సంవత్సరాల లోపు వయసున్న మహిళలకు ఏడాదికి రూ.20వేలు ఆర్థిక సాయం చేస్తామని ఇవ్వలేదన్నారు. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వకపోవడం సరికాదన్నారు. కరెంట్ చార్జీలు పెంచమనే హామీని విస్మరించి, ప్రజలపై భారం మోపడం తగదన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ పూర్తి స్థాయిలో ఎప్పుడు అమలు చేస్తారో అనంతపురంలో నిర్వహిస్తున్న సూపర్‌సిక్స్, సూపర్ హిట్ సభలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయకార్యదర్శులు మల్లికార్జున, రాజారెడ్డి, నగరకార్యదర్శి శ్రీరాములు, నాయకులు కేశవరెడ్డి, రమణయ్య,రాజేష్, సంతోష్, కృష్ణుడు, చెన్నప్ప, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి: ఎస్టీయూ



సభ్యత్వ నమోదులో ఎస్టీయూ నాయకులు

అనంతపురం విద్య, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే ఐఆర్ 30శాతం ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి డిమాండ్ చేశారు. అనంతపురంరూరల్ మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా అవి అమలు చేయపోవడం సరికాదన్నారు. వెంటనే ఐఆర్ ప్రకటించి, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు శివయ్యాచారి, డేనియల్ పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

గార్లదిన్నె, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక మైనార్టీ స్కూల్లో 7వ తరగతి చదువుతున్న గౌతమ్ కనిపించకుండా పోయాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురంలోని రాణినగర్‌లో నివాసం ఉంటున్న వెంకటలక్ష్మి, సాకే కుళ్లాయిస్వామి దంపతుల కుమారుడు గౌతమ్ రెండేళ్లుగా గార్లదిన్నె మైనార్టీ పాఠశాలలో చదువుకుంటున్నాడు. ప్రస్తుతం గౌతమ్ ఏడో తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం భోజనం సమయం నుంచి విద్యార్థి గౌతమ్ కనిపించలేదు. దీంతో పాఠశాలలో ఉపాధ్యాయులు వెతికారు. ఆచూకీ కనిపించకపోవడంతో తల్లిదండ్రులకు ఫోన్ చేసి, ఇంటికి వచ్చాడా.. అని అడిగారు. రాలేదని తల్లి దండ్రులు చెప్పారు. గౌతమ్ కోసం తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద తల్లిదండ్రులు వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం గార్లదిన్నె పోలీసు స్టేషన్‌లో తల్లి దండ్రులు, పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు చేసింది.

జిల్లాకు 800 మెట్రిక్ టన్నుల యూరియా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు 800 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద వ్యాగిన్లలో వచ్చిన యూరియా బస్తాలను ఏడీఏ మంగళవారం పరిశీలించారు. ఏపీ మార్క్‌ఫెడ్‌కు 560 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్లకు 240 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసినట్లు తెలిపారు.

చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురంరూరల్, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా 17,500తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.12,500 పలికాయని పేర్కొన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 946 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు వివరించారు.

నాలుగు దశల్లో స్థానిక ఎన్నికలు

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను నాలుగు దశల్లో జరుపుతామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని మంగళవారం వెల్లడించారు. ఈవీఏంలతో ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వంతో సంప్రదిస్తామన్నారు. ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ఇలా.. అక్టోబరు 15 లోగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలి. అక్టోబరు 16 నుంచి నవంబరు15లోగా వార్డుల వారిగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసి ప్రచురించాలి. నవంబరు 1 నుంచి 15లోపు ఎన్నికల అధికారుల నియామకం పూర్తి చేయాలి. నవంబరు 16 నుంచిడి 30 లోపు పోలింగ్ కేంద్రాల ఖరారు పూర్తి చేయాలి. డిసెంబరు 15 లోపు రిజర్వేషన్లు ఖరారు చేయాలి. చివరి వారంలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలి. జనవరి, 2026 లో ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి, నెలలోపే పూర్తి చేసి ఫలితాలు ప్రకటించాలి. అందుకు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టనున్నారు.

టమోటా కిలో రూ.17

అనంతపురం రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టామోటా గరిష్ఠంగా రూ.17తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మంగళవారం మార్కెట్‌కు 3,750 టన్నుల టమోటా కాయలు వచ్చాయని పేర్కొన్నారు. టమోటా కిలో కనిష్ఠ ధర రూ.10, సరసరా ధర రూ.14తో విక్రయాలు జరిగాయని వివరించారు.

రేపు సెమీ ఫైనల్

అనంతపురంరూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్‌టీయూఏలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ హాకథాన్-2025సెమీఫైనల్ ఈనెల 11న నిర్వహించనున్నట్లు క్వాంటమ్ వ్యాలీ హాకథాన్ కన్వీనర్ శోభా బిందు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జేఎన్‌టీయూ అనంతపురం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9:30గంటలకు జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శనరావు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. క్వాంటమ్ వ్యాలీ హాకథాన్‌కు కర్నూలు, అనంతపురం జిల్లాల సంబంధించి ప్రాంతీయ కేంద్రంగా జేఎన్‌టీయూను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ ప్రాంతాలకు చెందిన వివిధ విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థల నుంచి 19జట్లు సెమీఫైనల్ రౌండ్‌కు ఎంపికయ్యాయని వివరించారు. ఇక్కడ విజేతలైన జట్టు ఫైనల్‌రౌండ్‌లో అమరావతిలో తమ తమ విశ్వవిద్యాలయాలకు ప్రాతినిథ్యం వహిస్తాయన్నారు. సెమీఫైనల్‌లో మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.5వేలు యూనివర్సిటీ అందజేయనున్నట్లు తెలిపారు.

సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ జట్లను మంగళవారం ఎంపిక చేశారు. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో సెలెక్షన్స్ నిర్వహించారు. ఎంపికైన జట్ల వివరాలను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గాయత్రి, గంగమ్మ వెల్లడించారు. బాలుర జట్టులో ప్రణీత్‌నాథ్ రెడ్డి, దీక్షిత్‌రెడ్డి, తరుణ్‌కుమార్, భానుప్రసాద్, కాశీం, లోహిత్‌కుమార్, బద్రీ, సి గణేష్ శ్యామ్, కె గణేష్, సురేష్, మంతేష్, అభిరామ్, ప్రణీత్‌సాయిరాజ్, భరద్వాజ్, రాజు చోటు దక్కించుకున్నారు. స్టాండ్‌బైలుగా విష్ణుకాంత్, చరణ్, సిద్దిక్ బాషా, నిరూప్‌తేజ్ రెడ్డి, దినేష్‌నాయక్ ఎంపికయ్యారు. బాలికల జట్టులో కీర్తన, షబానా, అమ్ము, లక్ష్మి, శ్రావణి, అంజలి, మోక్షిత, పూజ, లలిత, రక్షిత, ఈక్షితయ, స్నేహ, సుప్రియ, నందిని, రజని, మైథిలి చోటు దక్కించుకున్నారు. స్టాండ్‌బైలుగా చైతన్య, ఆమని, ప్రసన్న, తులసి ఎంపికయ్యారు. జట్లు ఈనెల 26వ తేదీ నుంచి విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా సాఫ్ట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.



ఎంపికైన ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లు

రైతులు ఏరీ?

(6వ పేజీ తరువాయి)

వెడల్పు చేయడంతో పాటు హెచ్చెల్సీ ఆధునీకరణ చేపట్టాలన్నారు. అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, మాజీ ఎంపీ మాధవ్, పీఏసీ సభ్యుడు మహాలక్ష్మీ శ్రీనివాస్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

రైతాంగం నిర్వీర్యం

కూటమి ప్రభుత్వ పాలనలో రైతాంగం నిర్వీర్యమైందని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. రైతుపోరు కార్యక్రమంలో భాగంగా వైసీపీ నాయకులు మంగళవారం పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి పాలనలో ఎరువులు అందక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు రైతులను తక్కువ చేసి మాట్లాడటం సరికాదన్నారు. వెంటనే రైతులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు స్థానిక గణేష్ కూడలి నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

క్రీడలను దత్తత తీసుకోండి

పారిశ్రామికవేత్తలకు శాప్ చైర్మన్ పిలుపు



శాప్ చైర్మన్ రవినాయుడును సన్మానిస్తున్న కోచ్‌లు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు, క్రీడల దత్తతకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు పిలుపునిచ్చారు. స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేడియంలోని పరిసరాలను పరిశీలించి, నెలలో మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా చెత్త తొలగించి, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోచ్‌లు, సిబ్బందిని ఆదేశించారు. క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం విద్యా, వైద్యం, ఉద్యోగాలలో రిజర్వేషన్ శాతాన్ని పెంచినట్లు వెల్లడించారు. రిజర్వేషన్ పెంచడంలో డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద 421మందికి పీఈటీ పోస్టులు వచ్చినట్లు తెలిపారు. 2029నాటికి ప్రతి జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేసేలా త్వరలో అకాడమీలు ఏర్పాటు చేస్తా మన్నారు. గత వైసీపీ ప్రభుత్వం క్రీడలు, క్రీడాకారులకు చెల్లించాల్సిన రూ.16.30కోట్లు బకాయిలను తమ ప్రభుత్వం చెల్లించినట్లు తెలిపారు. అనంతరం కోచ్‌లు శాప్ చైర్మన్, డైరెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ బొమ్మినేని శివ, ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ లోకేష్‌యాదవ్, కోచ్‌లు జెబీవుల్లా, అలీ, మంజుల, అనిల్ కుమార్, నరేష్‌కుమార్, లక్ష్మి, సంధ్య, సూపరింటెండెంట్ దేవమణి, సుచీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు నాణ్యమైన సేవలు

● ఆప్కాబ్ చైర్మన్ 'గన్ని'



క్యూఆర్ కోడ్ సేవలను ప్రారంభిస్తున్న ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఖాతాదారులు, రైతులకు బ్యాంకు, సొసైటీల ద్వారా నాణ్యమైన సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో సహకార బ్యాంకులు, సొసైటీలలో నూతనంగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ సేవలను ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, విజయనగరం డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జునలతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. సొసైటీలలో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించి పారదర్శకంగా లావాదేవీలు చేస్తున్నామని, ఖాతాదారులకు, రైతులకు నాణ్యమైన, వేగవంతమైన సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కమర్షియల్ బ్యాంకులకు దీటుగా సేవలను మరింత విస్తృతం చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి, డీజీఎంలు రాంప్రసాద్, సుఖదేవ్‌బాబు, విజయచంద్రారెడ్డి, సీనియర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జర్దోసి మగ్గం ఎంబ్రాయిడరీలో 31 రోజుల ఉచిత శిక్షణ కోసం అర్హులైన యువతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సీబీ ఆర్ఎస్ఈటీఐ డైరక్టర్ శాంతిప్రియ మంగళవారం ప్రకటనలో తెలియచేశారు. 18-45 సంవత్సరాలలోపు గ్రామీణప్రాంత యువతులు అర్హులన్నారు. శిక్షణ కాలంలో భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తారన్నారు. ఆసక్తి గల యువతులు తమ ఆధార్, రేషన్‌కార్డు, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, బ్యాంకు పాస్‌బుక్, విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలను ఒక సెట్ బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 9705091727, 8500677585 ఫోన్ నంబర్లలో సంప్రందించాలని ఆమె తెలిపారు.

న్యూస్ బాక్స్

శ్రీవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్



జీవీకి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు

కదిరి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని ప్రభుత్వ విప్ జీవీ అంజనేయులు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారితో పాటు మార్కెఫెడ్ ఛైర్మన్ బంగారురాజు, డీజేపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత్ మాతృత్వ అభియాన్‌పై అవగాహన

గాండ్లపెంట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్‌పై మంగళవారం మండలకేంద్రం లోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ మహేశ్వర్ మారుతి గర్భిణులకు అవగాహన కల్పించారు. గర్భిణులు తప్పక పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వారానికి ఒకసారి వైద్యసిబ్బంది సూచనలు, సలహాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సూపర్‌వైజర్ ఉపేంద్రారెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదాత.. ప్రాణదాత



మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్

ధర్మవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రక్తదాత ప్రాణదాతతో సమానమని వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఎల్‌పీ సర్కిల్‌లోని పద్మావతి మహిళా డిగ్రీకళాశాలలో ఏపీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రజిని హెల్పింగ్ హాండ్స్, రక్తబంధం వారి సౌజన్యంతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మెగా రక్తదాన శిబిరాన్ని మంగళవారం ఏర్పాటుచేసింది. ముఖ్యఅతిథులుగా హాజరైన వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, ఏపీఎస్ఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల రాఘవేంద్ర ప్రసంగించారు. అనంతరం రక్తదానం చేసిన వారికి రూ. లక్ష ప్రమాదబీమాతో పాటు సర్టిఫికెట్లు, మెమొంటోలను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మల్లి కార్జున, న్యాయవాది సుమలత, ఏపీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బండి శివ, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు భాస్కర్, వైద్యాధికారి నిఖిల్, ఏపీఎస్ఎఫ్ నాయకులు పవన్‌కుమార్, హరి,రాము, దినేష్, స్వామి పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న కార్యదర్శి

గాండ్లపెంట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గ్రంథాలయాన్ని ఉమ్మడి జిల్లా గ్రంథాలయశాఖ కార్యదర్శి రమ మంగళవారం తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని రికార్డులను, పాఠకుల వివరాలను పరిశీలించారు. పాఠకుల సంఖ్య పెంచాలని గ్రంథాలయ అధికారి శాంతమ్మకు సూచించారు. విద్యార్థులకు వినోదంతో పాటు విజ్ఞానం అందించే పుస్తకాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు.

నైపుణ్య శిక్షణతో జ్ఞానాభివృద్ధి

ధర్మవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నైపుణ్య శిక్షణతో జ్ఞానం పెంపొందుతుందని ఓఎస్‌సీ అడ్మినిస్ట్రేటర్ హసీనా తెలిపారు. పట్టణంలోని వాసవి జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థినులకు ఎడ్యుకేషనల్ ఒకేషనల్ స్కిల్స్ గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓఎస్‌సీ అడ్మినిస్ట్రేటర్ హసీనా, కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య మాట్లా అవగాహన కల్పించారు. అన్ని హెల్ప్‌లైన్స్ గురించి వివరించారు. విద్యార్థులకు చదువుతోపాటు స్కిల్స్ కూడా చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకండి



మాట్లాడుతున్న పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు

ధర్మవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వాడకం నివారణపై మంగళవా రం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు చిట్టెమ్మ, త్రివేణి, షమీవుల్లా, ఎన్‌సీసీ అధికారి పావని, కిరణ్‌కుమార్, పుష్పావతి, ఆనంద్, సరస్వతి, మీనా, ధనుంజయ పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది మృతి



పూల శ్రీనివాసులు (ఫైల్)

కదిరి లీగల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది పూల శ్రీనివాసులు ఆకస్మికంగా మృతిచెందారు. 36 సంవత్సరాల పైబడి న్యాయవాదిగా కొనసాగిన ఆయనకు మంగళవారం ఉదయం గుండెలో నొప్పి రావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య సేవలు కొనసాగుతుండగానే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. విషయం తెలిసిన న్యాయవాదులు, పుర ప్రముఖులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. న్యాయవాదుల సంఘానికి అధ్యక్షుడిగా, ప్రభుత్వ న్యాయవాదిగా శ్రీనివాసులు పనిచేశారు. బుధవారం ఉదయం కమతంపల్లెలో అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు.

రోడ్డుకు అడ్డంగా ఉన్న స్తంభం తొలగింపు



స్తంభాన్ని పక్కకు మార్చుతున్న విద్యుత్‌శాఖ అధికారులు

ధర్మవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 24వ వార్డులో చాలా ఏళ్లుగా రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని పక్కకు మార్చారు. విద్యుత్ శాఖ మంత్రి ఆదివారం పట్టణంలోని టీడీపీ ధర్మవరం పార్టీ కార్యాలయానికి ఆదివారం వచ్చారు. ఆయనకు టీడీపీ 24వ వార్డు నాయకులు... వార్డులో ఎన్నో సంవత్సరాలుగా రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభం ఉందని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఆ స్తంభాన్ని తొలగించేలా చూడాలని విన్నవించారు. స్పందించిన మంత్రి రవికుమార్, టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ సూచనతో విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఏఈ నాగభూషణ, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, జిలాన్, బిల్లేరాజజా, సురేశ్ దగ్గర ఉండి సిబ్బందితో మంగళవారం రోడ్డుకు అడ్డంగా ఉన్న స్తంభాన్ని తొలగించి పక్కకు మార్చారు. దీంతో ప్రజలు మంత్రి, పరిటాలశ్రీరామ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం దివాలా



సహకార సంఘం అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న హరిప్రసాద్

- అప్పులమయమైన రాష్ట్రానికి ఆక్సిజన్‌లా సీఎం
- సహకార సంఘం అధ్యక్షుడి ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

కొత్తచెరువు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో అప్పుల మయమైన రాష్ట్రానికి సీఎం చంద్రబాబు ఆక్సిజన్‌లా మారి, పరిస్థితులను గాడిలో పెడుతున్నారని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో కొత్తచెరువు ప్రాథమిక సహకార సొసైటీ అధ్యక్షుడిగా అప్పకొండప్పగారి హరిప్రసాద్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని మంగళవారం సొసైటీ సీఈఓలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మాజీ సీఎం జగన్, ఆయన కోటరీ దోచుకుని దాచుకోవడంతో రాష్ట్రం అప్పులమయం అయిందన్నారు. రైతులు, ప్రజల గురించి పట్టించుకోలేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన 15నెలల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వంద శాతం సూపర్‌హిట్ చేసిందన్నారు. బుధవారం అనంతపురంలో జరిగే బహిరంగ సభకు పెద్దఎత్తున పార్టీశ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆమె కోరారు. సీఎం చంద్రబాబు కూటమి నాయకులకు సమ ప్రాధాన్యమిస్తూ పార్టీ కోసం కష్టపడిన వారికి పదవులను ఇస్తున్నారన్నారు. ఇందుకు నిదర్శనం విశ్రాంత ఉపాధ్యాయుడు హరిప్రసాద్ అన్నారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు హరిప్రసాద్, డైరెక్టర్లు లక్ష్మీదేవి, అహమ్మద్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ పదవి అప్పచెప్పిన మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. రైతులకు అందుబాటులో ఉండి తోడ్పాటు అందిస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు సాలక్కగారి శ్రీనివాసులు, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, శివప్రసాద్, మండల, టౌన్ కన్వీనర్లు రామకృష్ణ, శీన, మాజీ ఎంపీపీ వాణి, పుట్టపర్తి మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ పూలశివ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, సాగునీటి సంఘం అధ్యక్షువడు పీవీ నవీన్‌కుమార్, బీజేపీ నాయకులు శేషాద్రినాయుడు, దివ్యతేజ, మాజీ సర్పంచ్‌లు హరినాథ్‌చౌదరి, మాణిక్యంబాబా, విశ్రాంత ఉపాధ్యాయులు రామకృష్ణప్ప, వెంగన్న, శివయ్య, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సూపర్‌హిట్ సభకు తరలిరండి

- తెలుగు మహిళల పిలుపు



33వ వార్డులో ఆహ్వానిస్తున్న తెలుగు మహిళలు, టీడీపీ నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం నిర్వహించే సూపర్‌సిక్స్- సూపర్‌హిట్ సభకు పెద్దఎత్తున తరలిరావాలని టీడీపీ నాయకులు పిలుపు నిచ్చారు. తెలుగుమహిళలు మంగళవారం 33వ వార్డులో ఇంటింటికి వెళ్లి మహిళలకు బొట్టుపెట్టి ఆహ్వానించారు. స్త్రీశక్తి, తల్లికి వందనం, ఉచిత గ్యాస్, ఉచిత బస్సు ప్రయాణం పథకాలతో ప్రతి మహిళ ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. సీఎం చంద్రబాబు వస్తున్న సూపర్‌హిట్ సభకు మహిళలు పెద్దఎత్తున తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోసల శ్రీరాములు, పూజామొబైల్ సాయి, మార్కెట్ రహీం తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకున్నది సీఎం చంద్రబాబే

- మాజీ జడ్పీటీసీ మేకల రామాంజనేయులు

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు అన్నదాత సుఖీభవతో సంవత్సరానికి రూ. 20 వేలతో పాటు రాయితీతో వ్యవసాయ పరికరాలు, ఎరువులను అందుబాటులోకి తెచ్చి రైతులను ఆదుకున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని టీడీపీ మండల నాయకులు, మాజీ జడ్పీటీసీ మేకల రామాంజినేయులు పేర్కొన్నారు. వైసీపీ చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమంపై మంగళవారం ఆయన మాట్లాడారు. గతంలో వైసీపీ ప్రభుత్వం రైతులను దగా చేసి, ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాగానే ఏడాదిలోనే అన్ని పథకాలను అమలు చేస్తూ సీఎం చంద్రబాబు ప్రజల మన్ననలు పొందుతున్నారని అన్నారు. కేంద్రంతో మాట్లాడి రాష్ట్రంలో రైతులకు యూరియా కొరత రాకుండా చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే సూపర్‌సిక్స్ పథకాలైన తల్లికివందనం, స్త్రీశక్తి, అన్నదాతసుఖీభవ, పింఛన్లు పెంపు తదితరాలను అమలు పరిచి అన్నివర్గాలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. సీఎం చంద్రబాబుకు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

చేనేతలకు హామీలను అమలు చేయాలి

- ఏపీ ప్రగతిశీల చేనేత కార్మిక సంఘం నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ హామీల మాదిరి చేనేతల హామీలను అమలు చేయాలని ఏపీ ప్రగతిశీల చేనేత కార్మిక సంఘం రాయలసీమ జోన్ కన్వీనర్ పోలా లక్ష్మీనారాయణ మంగళవారం ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను దిగ్విజయంగా అమలు చేసిందని, అలాగే చేనేతలకు ఇచ్చిన హామీలనుఅమలు చేయాలని డిమాండ్‌చేశారు. చేనేత కుటుంబాలకు ఏడాది రూ.25వేలు ఇస్తామని, చేనేతలకు జీఎస్టీ రీఎంబర్స్‌మెంట్ హామీలను ఇచ్చిందన్నారు. ఆత్మహత్య చేసుకున్న చేనేతల కుటుంబాలకు రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాల న్నారు. చేనేతలకు రెండు సెంట్ల స్థలంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, చేనేత లకు పింఛన్లు, ఆరోగ్య బీమా మంజూరు చేయాలని ఆయన కోరారు.

అక్టోబరు 4న సాధారణ సమావేశం

కదిరి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు, కలెక్టర్ టీఎస్ చేతన్ అధ్యక్షతన అక్టోబరు 4న ఉదయం 10గంటలకు జిల్లా సహకార అధికారి కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు సైదాపురం సొసైటీ అధ్యక్షుడు హనుమంతురెడ్డి తెలిపారు. పోషకులు, ఉప పోషకులు, జీవితకాల సభ్యులు ఆధార్, సభ్యత్వ కార్డులతో సమావేశానికి హాజరుకావాలన్నారు. ఈసమావేశంలో పది మంది సభ్యులతో కూడిన జిల్లా శాఖ నిర్వాహణ కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ కమిటీ సభ్యులలో నుంచి ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కోశాధికారిని ఎన్నుకుంటారని ఆయన తెలిపారు.

విజయవంతం చేద్దాం

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు



బత్తలపల్లిలో మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు

ధర్మవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం నిర్వహించే సూపర్‌సిక్స్- సూపర్‌హిట్ బహిరంగ సభను చేసేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ధర్మవరం, ధర్మవరం రూరల్, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లోని బీజేపీ కార్యాల యాల్లో మంగళవారం పార్టీశ్రేణులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో హరీశ్‌బాబు మాట్లాడుతూ... సీఎం సభను విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సూపర్‌హిట్ సభ రాష్ట్ర రాజకీయ చరిత్రలో మైలురాయి కానుందన్నారు. కేంద్రం మద్దతుతో రాష్ట్రంలో అమలవుతున్న సూపర్‌సిక్స్ పథకాల ప్రాముఖ్యాన్ని వివరి స్తార న్నారు. కావున సభకు పెద్దఎత్తున హాజరుకావాలని ఆయన కోరారు.

- ఓబుళదేవరచెరువు: అనంతపురంలో బుధవారం నిర్వహించే సూపర్ సిక్స్-సూపర్‌హిట్ సభకు ఎన్డీఏ కూటమి నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఇడగొట్టు వీరాంజనేయులు మంగళవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. కార్యక్రమానికి కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి
- రణభేరి పోస్టర్ల విడుదల



రణభేరి పోస్టర్లను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే రణభేరి కార్యక్రమ పోస్టర్లను యూటీఎఫ్ నాయకులు మంగళవారం శాంతినగర్ ప్రభుత్వ పాఠశాలలో విడుదల చేశారు. అనంతరం శెట్టిపి జయచం ద్రారెడ్డి మాట్లాడుతూ... 12వ పీఆర్సీ ఊసేలేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడి 15నెలలు గడుస్తున్నా ఒక్క డీఏ కూడా ఇవ్వలేదన్నారు. ఉద్యోగులకు వేల కోట్ల ఆర్థిక బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో అన్నారు. బోధనేతర కార్యక్రమాలతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని విమర్శించారు. విద్యాశక్తి కా ర్యక్రమంతో తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. పరీక్షల మూల్యాంకనం ఉపాధ్యా యులకే పరీక్షగా మారిందన్నారు. ఉమ్మడి సర్వీసెస్ సమస్యను పరిష్కరించాలన్నారు. బదిలీలు, ప్రమోషన్లు పూర్తి అయి మూడు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులు ఇంకా పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారని అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణనాయక్, పట్టణ అధ్యక్షుడు జింకా హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి సాయిగణేశ్, నాయకులు రామకృష్ణ, లక్ష్మయ్య, రాంప్రసాద్, రామాంజినేయులు పాల్గొన్నారు.

'ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాలి'

గాండ్లపెంట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు స్పందించి ఆర్డీటీ సేవలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కదిరి సభ్యులు రాంప్రసాద్‌నాయక్ డిమాండ్‌చేశారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్‌లో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. వెంటనే రెన్యువల్ చేయాలని కోరుతూ ఈనెల 15న తహసీల్దార్ కార్యాల యాల వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు

యూరియా కోసం పడిగాపులు



ఓరువాయిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

నల్లచెరువు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓరువాయి రైతు సేవా కేంద్రంలో యూరియా కోసం రైతులు క్యూలైన్లలో బారులు తీరారు. వెయ్యి బస్తాల యూరియా అవసరం కాగా, కేవలం 250 బస్తాలు మాత్రమే వచ్చింది. దీంతో పలువురు రైతులు వెనుదిరిగారు. పంచాయతీకి వెయ్యి బస్తాలు అవసరమున్నా, కొద్దిపాటిగా యూరియా రా వడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు ఎక్కువమంది రావడంతో పంపిణీ ఆలస్యంగా ప్రారంభించారు. ఉన్నతాధికారులు స్పందించి రైతులందరికి యూరియా అందించాలని రైతులు కోరుతున్నారు.

యూరియా కొరత లేదు: ఆర్డీఓ



బుక్కపట్నం సొసైటీలో యూరియా పంపిణీ చేస్తున్న ఆర్డీఓ సువర్ణ

బుక్కపట్నం/కొత్తచెరువు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): యూరియా కొరత లేదని, అవసరమైన ప్రతి రైతుకు యూరియా పంపిణీచేస్తామని ఆర్డీఓ సువర్ణ, ఏడీఏ సనావుల్లా తెలిపారు. బుక్కపట్నంలోని ప్రాథమిక సహకార కేంద్రం, పాముదుర్తి రైతు సేవా కేంద్రంలో మంగళవారం యూరియా పంపిణీని పరిశీలించారు. ఇప్పటి వరకు బుక్కపట్నం మండలంలో 80టన్నుల యూరియా అందించామన్నారు. రైతులందరూ వ్యవసాయ శాస్త్రవేత్తల సూచలన మేరకు నానో యూరియాపై అవగాహన పెంచుకుని పంట దిగుబడులు పెంచుకోవాలన్నారు. బుక్కపట్నం ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు చెన్నక్రిష్ణ, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ నరసింహులు, ఎఓ నటరాజ్, సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు సంజీవరాయుడు పాల్గొన్నారు. అలాగే కొత్తచెరువులోని మన గ్రో మోర్ సెంటర్ ద్వారా వ్యవసాయాధికారి సతీశ్‌బాబు టోకెన్ పద్ధతిలో యూరియా పంపిణీచేశారు. పంపిణీని ఆర్డీఓ సువర్ణ పరిశీలించారు. మొత్తం 280 యూ రియా బస్తాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ క్రిష్ణమీనన్, ఏఈఓలు సునీత పాల్గొన్నారు.

కదిరి డివిజన్‌లో 226 టన్నుల స్టాకు: ఏడీఏ

- కదిరి అర్బన్/గాండ్లపెంట: కదిరి డివిజన్‌లో యూరియా కొరత లేదని వ్యవసాయ శాఖ ఏడీ సన్నావుల్లా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కదిరి డివిజన్‌లోని పది మండలాల్లో 226 మెట్రిక్ టన్నుల యూరియా ప్రైవేటు డీలర్లు, రైతు సేవా కేంద్రాల్లో పంపిణీకి సిద్ధంగా ఉందన్నారు. యూరియాకు బదులుగా నానో యూరియా వాడకంపై వివరించారు. ప్రతిరైతుకు యూరియాను అందిస్తామని ఆర్డీఓ వీవీఎస్ శర్మ మంగళవారం తెలిపారు. మండలంలోని కుర మామిడి రైతు సేవా కేంద్రాన్ని ఆర్డీఓ మంగళవారం సందర్శించారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులోకి తెస్తామనితెలిపారు. కటారుపల్లి రైతు సేవా కేంద్రంలో 140, కురమామడిలో 140 బస్తాల యూరియాను పంపిణీ చేసినట్లు ఏఓ షాదాబ్ తెలిపారు. ఈపంపిణీలో తహసీల్దార్ బావురావు, వీఆర్ఓ చంద్ర, సర్పంచ్‌లు సుధాకర్, శివప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.
- ధర్మవరం రూరల్/పుట్టపర్తి రూరల్: ధర్మవరం మండలంలోని దర్శినమల, ఏలకుంట్ల గ్రామాల రైతు సేవా కేంద్రాలకు 6.3మెట్రిక్ టన్నుల చొప్పున వచ్చిన యూరియాను మంగళవారం ఏఓ ముస్తఫా పరిశీలించారు. అలాగే మండలంలోని మల్లాకాల్వ, ఓబుళనా యునిపల్లిలో రైతులతో కలిసి ఏఓ ముస్తఫా పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే పుట్టపర్తి రూరల్ మండ లంలోని రైతులందరికి యూరియా అందుబాటులో ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీవాణి పేర్కొన్నారు.

యూరియా పంపిణీ

- నంబులపూలకుంట: మండలంలోని పి.కొత్తపల్లి, గౌకనపేట రైతు సేవాకేంద్రాల్లో మంగళవారం యూరియా పంపిణీ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి నరసింహులు, మాజీ సర్పంచ్ శ్రీరాములనాయుడు ఆధ్వర్యంలో పి.కొత్తపల్లిలో యూరియా పంపిణీ చేశారు. ఏఓ లోకేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ రెండు రైతుసేవా కేంద్రాల్లో 25.2 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు.
- ఓబుళదేవరచెరువు: మండలంలోని వెంకటాపురం పంచాయతీలో మంగళవారం రైతులకు యూరియాను తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎఈఓ నయాజ్ పంపిణీచేశారు. 140 బస్తాల యూరియా (6.3 క్వింటాళ్లు) అందించారు. సర్పంచ్ శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, వీఏఏ శ్రీలత, రైతులు పాల్గొన్నారు.
- తనకల్లు: మండలంలోని కొక్కంటి క్రాస్‌లో ఉన్న గ్రోమోర్ ఎరువుల దుకాణంలో మంగళవారం 12 టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేసినట్లు ఏఓ భారతి తెలిపారు. ఒకరికి రెండు బస్తాలు అందించామన్నారు. వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

అధిక మోతాదులో యూరియా వాడకండి

అమడగూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అధిక మోతాదులో యూరియా వాడకం సరికాదని ఏఓ వెంకటరమణాచారి పేర్కొన్నారు. యూరియా వాడకంపై మండలంలోని చీకిరేవులపల్లిలో పంటలు సాగుచేసిన రైతులకు ఆయన మంగళవారం అవగాహన కల్పించారు. యూరియా అధికంగా వాడితే అనేక నష్టాలు కలుగుతాయన్నారు. అలాగే నానో యూరియా వాడి, అధిక దిగుబడులు సాధించాలని ఆయన సూచించారు.

వ్యవసాయ మోటార్లకు మీటర్లు వద్దు

- సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్



మాట్లాడుతున్న వేమయ్య యాదవ్

నంబులపూలకుంట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యుత్ మోటార్లకు స్మార్టు మీటర్లు బిగించే ప్రక్రియను రద్దు చేసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని శివాలయం వద్ద పార్టీ సీనియర్ నాయకుడు సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన మంగళవారం మండల కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా హాజరైన వేమయ్య మాట్లాడుతూ... ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా ప్రభుత్వం ప్రతి రైతుకు పెట్టుబడి సాయంగా తక్షణం రూ. 20వేలు విడుల చేయాలన్నారు. 2013 భూసేకరణ చట్టంలోని రైతు వ్యతిరేక అంశాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీమా రుసుం ప్రభుత్వమే భరించి 50 ఏళ్లు నిండిన రై తులకు రూ.10వేలు పింఛన్ అందించి ఆదుకోవాలన్నారు. అనం తరం సీపీఐ మండల కార్యదర్శిగా రాజారెడ్డి, సహాయ కార్యదర్శిగా గంగులప్పతో పాటు కౌన్సిల్ సభ్యులుగా 11మందిని ఎన్నుకున్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు సన్మానం



టీచర్స్ క్రికెట్ విజేతలను సన్మానిస్తున్న దృశ్యం

నంబులపూలకుంట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కదిరిలో నిర్వహించిన టీచర్స్ టోర్నమెంట్ విజేత అయిన ఎస్సీకుంట జట్టు సభ్యులను మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సన్మానించారు. ఎంఈఓలు గోపాల్‌నాయక్, గంగాధర్‌రెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్‌రెడ్డి, మురళి వారిని పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. కదిరిలో జరిగిన పోటీల్లో ఎస్సీకుంట జట్టు గెలుపొందడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మోహన్‌రెడ్డి, హనీఫ్, శ్రీనివాసరెడ్డి, వెంకటరామిరెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.


స్వాగతం - సుస్వాగతం
బాబు సూపర్ 6
అన్నదాత
సూపర్ సిక్స్
సూపర్ హిట్
విజయోత్సవ బహిరంగ సభకు
విచ్చేస్తున్న మన ప్రియతమ ముఖ్యమంత్రి వర్యులు
గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
ఉప ముఖ్యమంత్రివర్యులు
గౌ॥ శ్రీ పవన్ కళ్యాణ్ గారికి
యువగళం రథ సారథి
గౌ॥ శ్రీ నారా లోకేష్ గారికి
రాష్ట్ర మంత్రులకు,
కూటమి ఎం.ఎల్.సి.లు,
ఎం.ఎల్.ఎ.లు
కార్పొరేషన్ ఛైర్మన్లకు,
స్వాగతం – సుస్వాగతం
23వ ఆంధ్రజ్యోతి వార్షికోత్సవ శుభాకాంక్షలు
సూపర్ హిట్ విజయోత్సవ సభను
విజయవంతం చేద్దాం కదలి రండి...!
తరలి రండి...!
శ్రీ దగ్గుపాటి
వెంకటేశ్వర ప్రసాద్
శాసనసభ్యులు, అనంతపురం అర్బన్
వేదిక
ఇంద్రప్రస్థ గ్రౌండ్, 80 అడుగుల రోడ్డు, అయ్యప్ప స్వామి గుడి దగ్గర, అనంతపురం, తేది: 10.09.2025 బుధవారం : మ॥ 1:00 గం॥కు
అనంతపురం అర్బన్ నియోజకవర్గం నాయకులు - కార్యకర్తలు

చంద్రన్నతోనే అభివృద్ధి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్/రొళ్ల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడుతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అభివృద్ధిలో 20 ఏళ్ల వెనక్కి వెళ్లిందన్నారు. మంగళవారం బాలాజీనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో రొళ్ల మండలం అవినకుంట, జీజీహట్టి, దొడ్డేరి గ్రామాలకు చెందిన 20 కుంటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. గుండుమలతిప్పేస్వామి, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దేవేంద్రప్ప సమక్షంలో వారు పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి సాదారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని పనులకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి అనేక మంది టీడీపీలోకి రావడానికి మొగ్గు చూపుతున్నారన్నారు. అవినకుంట, జీజీ హట్టి, దొడ్డేరి గ్రామాలకు చెందిన వెంకటప్ప, సిద్దప్ప, ఉమేష్‌తోపాటు 20కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, లక్ష్మీనారాయణ, నరసింహరాజు, భక్తర్, కన్వీనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'అండగా ఉంటాం'

అగళి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల అభివృద్ధికి ఎప్పుడూ అండగా ఉంటామని జడ్పీటీసీ ఉమేష్ పేర్కొన్నారు. అగళి ఎస్సీ కాలనీలోని ఆర్డీటీ భవనంలో మహిళా సంఘాలతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్థికంగా మహిళలను అభివృద్ధి చేశామన్నారు. తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం తదితర కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అనంతపురంలో సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కార్యక్రమానికి తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ రంగమ్మ, నాగోజీ, మహిళలు పాల్గొన్నారు.

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలి



వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

అగళి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని మండల ఎస్సీ కాలనీలోని ఆర్డీటీ భవనంలో మహిళా సంఘ సభ్యులు కోరారు. ఈ మేరకు జడ్పీటీసీ ఉమేష్‌కు వినతిపత్రం అందించారు. ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ ఎఫ్‌సీఆర్‌ఏను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసిందని, దీంతో సంస్థకు వచ్చే విరాళాలు రాకపోవడంతో విద్య, వైద్యం పేదల గృహనిర్మాణాలు నిలిచిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుడి తిప్పేస్వామి, మండల సింగిల్‌విండో అధ్యక్షులు కుమారస్వామి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు కుమారస్వామి, మాజీ మండల కన్వీనర్‌షౌకత్, ఎంపీటీసీ నాగోజీ, కర్రీఅన్న, బూత్‌రాజు, మంజన్న, మహిళలు పాల్గొన్నారు.

జన సమీకరణపై చర్చ



బాచన్నపల్లిలో పర్యటిస్తున్న అబ్జర్వర్ నరసింహారావు

గోరంట్ల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పెనుకొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, పరిశీలకుడు రాయల్ నరసింహరావు గొల్లపల్లి, బాచన్నపల్లి గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. అనంతపురంలో బుధవారం జరిగే విజయోత్సవ సభకు జనమీకరణ విషయంలో కూటమి నాయకులతో మాట్లాడారు. గొల్లపల్లిలో టీడీపీ నాయకులు వడిగేపల్లి సర్పంచ్ నరసింహమూర్తి, చంద్రశేఖర్ తదితరులు, బాచన్నపల్లిలో జనసేన కన్వీనర్ సంతోష్, మాజీ డీలర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి టీడీపీ నాయకులు సోముశేఖర్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఉత్తమ విద్యతోనే ఉన్నత శిఖరాలకు..

- ఎమ్మెల్యే వెంకటేశ్



రిటైర్డ్ టీచర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

పావగడ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉత్తమ విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఎమ్మెల్యే వెంకటేశ్ అన్నారు. మంగళవారం ఏఎస్‌కే మందిరంలో నిర్వహించిన ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో సంతృప్తికరమైన ఆనందమైన జీవితం దాగి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించారు. బీఈఓ రేణుకమ్మ, ఈఓ ఉత్తంకుమార్, మున్సిపల్ అధ్యక్షుడు సుదేష్‌బాబు, ప్రొఫెసర్ లీలావతి, కౌన్సిలర్‌లు రవి, రాజేష్ పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

సోమందేపల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఎస్‌ఆర్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణులకు, బాలింతలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, ఐటీడీపీ కార్యదర్శి మద్దిలేటి, టీడీపీ నాయకులు నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రాంతాలలోని వివిధ గ్రామాల్లో ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అవసరం మేరకు యూరియా అందించండి

డిమాండ్ చేస్తున్న రైతులు



యూరియా కోసం సొసైటీ వద్ద రైతులు

మడకశిర, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరం ఉన్నంత మేర యూరియా అందించాలని రైతులు డిమాండు చేస్తున్నారు. మంగళవారం యూరియా కోసం గ్రామాల నుంచి రైతులు ద్విచక్రవాహనాల్లో తరలివచ్చారు. మడకశిరలో సొసైటీ వద్ద యూరియా కోసం రైతులు క్యూలో నిలబడ్డారు. ప్రభుత్వం రైతులకు రెండు బస్తాలు యూరియా పంపిణీ చేస్తున్నారని. మూడు నాలుగు ఎకరాల్లో పంటలు సాగు చేసిన వారికి రెండు బస్తాలు యూరియా చాలడం లేదని రైతులకు అంటున్నారు. రైతులకు అవసరం ఉన్నంత మేర అందించాలని కోరుతున్నారు. మడకశిర మండలానికి 200 మెట్రిక్ టన్నులు, గుడిబండకు 230 మెట్రిక్ టన్నులు, అగళికి 120 మెట్రిక్ టన్నులు, రొళ్లకు సంబంధించి 160 మెట్రిక్ టన్నులు, మడకశిరలో 50 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశారు. ఆర్‌ఎస్‌కేలకు యూరియా సరఫరా చేసి అక్కడి నుంచి రైతులకు అందించాలని కోరుతున్నారు. రైతుసేవా కేంద్రాలతోపాటు, మండల కేంద్ర అయిన మడకశిర సొసైటీలలో కూడా యూరియా అందుబాటులో ఉంచి రైతులకు అందించడం జరుగుతుందని సంబంధిత శాఖ అధికారులు అంటున్నారు. మడకశిర మండలంలో గౌడనహళ్లి, రైతు సేవాకేంద్రంలో రైతులకు యూరియా, డీఏపీని రైతులకు పంపిణీ చేశారు.

ఆర్‌ఎస్‌కే, సొసైటీల ద్వారా యూరియా పంపిణీ

ఆర్‌ఎస్‌కే, సొసైటీల ద్వారా రైతులకు యూరియా, డీఏపీని పంపిణీ చేస్తున్నాం. మడకశిర మండలానికి 200 మెట్రిక్ టన్నులు, గుడిబండ మండలానికి 230 మెట్రిక్ టన్నులు, అగళికి 120 మెట్రిక్ టన్నులు, రొళ్ల మండలంలో 160 మెట్రిక్ టన్నులు, మడకశిరలో 50 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేయడం జరిగింది.

- తిమ్మప్ప, వ్యవసాయ అధికారి

రైతులకు అందుబాటులో యూరియా: ఏఓ

గోరంట్ల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా సరఫరా చేస్తామని ఏఓ శంకర్‌నాయక్ తెలిపారు. నారసింపల్లి, గౌనివారిపల్లి రైతు సేవాకేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందన్నారు. మందలపల్లి, మల్లాపల్లి రైతు సేవా కేంద్రాలకు బుధవారం వస్తుందన్నారు. మిగిలిన కేంద్రాల్లో పంట సాగువిస్తీర్ణం బట్టి ప్రణాళికమేరకు అందుబాటులోకి తేస్తామన్నారు.

మోతాదుకు మించి వాడొద్దు: ఏఓ

సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయశాఖ అధికారి విజయభారతి తెలిపారు. మంగళవారం కేతగాని చెరువు, చాలకూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూరియా అందుబాటులో ఉందని రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వరికి 101 కిలోలు, మొక్కజొన్నకు 132కిలోలు, వేరుశనగకు 20కిలోలు వాడుకోవాలన్నారు. అదేవిధంగా పంటలకు విధిగా ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా నిల్వ వివరాలు వెల్లడించారు. గుడిపల్లి 10.35మెట్రిక్ టన్నులు, పందిపర్తి 6.3, తుంగోడు 7.2, కేతగానిచెరువు 6.3, మాగేచెరువు 6.3, జూలకుంట 6.3, చాలకూరు 6.3, చల్లాపల్లి 6.3 మెట్రిక్ టన్నుల యూరియా ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అలైఖ్య, బీఎస్‌ఏలు నరేంద్ర, జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

పంపిణీ చేస్తున్నాం: అధికారులు

మడకశిర రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులకు కావాల్సినంత యూరియా రైతుసేవా కేంద్రాల్లో, సొసైటీలోను అందుబాటులో ఉందని తహసీల్దార్ హసీనా బేగం, జిల్లా కోఆపరేటివ్ అధికారి క్రిష్ణనాయక్, వ్యవసాయ అధికారి తిమ్మప్ప తెలిపారు. మంగళవారం బుళ్లసముద్రం, గౌడనహళ్లి రైతు సేవాకేంద్రాల్లో 840 బస్తాల యూరియాను రైతులకు పంపిణీచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వారం రోజులో రైతులకు కావల్సినంత యూరియా అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నాగరాజు, మాజీ సర్పంచు జైపాల్, ఆర్ఐ సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



బుళ్ల సముద్రంలో యూరియాను పంపిణీ చేస్తున్న అధికారులు

వైసీపీ అసత్య ప్రచారాలను నమ్మరు

మడకశిర రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): యూరియాపై వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను రైతులు నమ్మరని సింగిల్ విండో డైరెక్టర్ నరసంహప్ప క్లస్టర్ కన్వీనర్ మురళీబాబు అన్నారు. మంగవారం గౌడనహళ్లి రైతు సేవా కేంద్రం వద్ద వారు అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియా, డీఏపీ కాంప్లెక్స్ ఎరువుల కొరత లేకుండా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి ఎంతో కృషిచేస్తుంటే వైసీపీ నాయకులు ఓర్వలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జనసేన, బీజేపీ నాయకులు ప్రసాద్, క్రిష్టప్ప, గోపాలప్ప, మల్లేగౌడ్, గంగధర్ పాల్గొన్నారు.

సూపర్ హిట్ సభను జయప్రదం చేద్దాం

- ఎమ్మెల్సీ బీటీ నాయుడు



నాయకులతో సమావేశమైన బీటీ నాయుడు, శ్రీనివాసరావు

హిందూపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం జరిగే సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ సభను జయప్రదం చేద్దామని ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కార్యాలయంలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో బీటీనాయుడు, నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావులు సమావేశం అయ్యారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గానికి 170బస్సులు ఏర్పాటు చేశామని, వంద కార్లు ఏర్పాటు చేశామని వీటికి నాయకులు జనాన్ని తరలించే బాధ్యత తీసుకోవాలన్నారు. చాలా మంది ఈ కార్యక్రమానికి రావాలని ఉత్సాహంగా ఉన్నారన్నారు. నియోజకవర్గానికి 500బస్సులు కేటాయించినా జనం వస్తారని అయితే అనంతపురంలో సభ ఏర్పాట్లకు తగ్గట్టుగా తరలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, మున్సిపల్ చైర్మన్ రమేష్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, పార్టీ కన్వీనర్ వెంకటేష్, రాము, అబి, శ్రీనివాస్, నాయకులు మంజునాథ్, షఫీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీకి బస్సులు

హిందూపురం(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం జరగనున్న సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ భారీ బహిరంగసభకు తరలి రావాలని, బస్సు సౌకర్యం కల్పించినట్లు టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తెలిపారు. నియోజకవర్గం నుంచి ఉదయం 9 గంటలకే బస్సులు బయలుదేరుతాయన్నారు. కియ పరిశ్రమవద్ద మంత్రి సవిత పెట్రోల్‌బంక్ సమీపంలో భోజనాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బస్సులు మంగళవారం రాత్రికే ఆయా గ్రామాలు చేరుకుంటాయన్నారు.

సమస్యలను పరిష్కరించండి

- ఏఐటీయూసీ నాయకులు



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

హిందూపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ వాటర్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయుసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయుసీ నాయకులు వినోద్ మాట్లాడుతూ గొల్లపల్లి వాటర్‌వర్కర్స్‌కు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలన్నారు. వారికి కనీస వేతనం రూ.20వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ నాయకులు ఆంజనేయులు, మారుతిరెడ్డి, సమీవుల్లా, జిలాన్, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన దివ్యాంగ విద్యార్థులకు సత్కారం

హిందూపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): హిందూపురంలోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులు ఐటీఐలో ఉత్తీర్ణత సాధించారు. వీరిని మంగళవారం సన్మానించారు. కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్మన్ రమేష్ మాట్లాడుతూ ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని అందుకు వీరే నిదర్శనమన్నారు. ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాసమన్వయకర్త ఆనంద్‌బాబు, ఎంఈఓ ప్రసన్నలక్ష్మీ, ఫిజియోథెరపి రూపేష్‌నాయక్, బైసాని రాంప్రసాద్, భవిత కేంద్రం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచిన ప్రభుత్వం: వైసీపీ

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచుతోందని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీ చరణ్ మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం తలపెట్టిన యూరియా కొరతపై రైతులతో కలిసి పెనుకొండ పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఉషాశ్రీ మాట్లాడుతూ రైతులకు సకాలంలో యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహ, పొగాకు రామచంద్ర, నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే పర్యటన

కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్



మాట్లాడుతున్న ఈశ్వర్

మడకశిర టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వెనకబడిన వర్గాల అభివృద్ధితోపాటు కమ్మరి సామాజికవర్గం అభివృద్ధి చెందాలంటే సీఎం చంద్రబాబుతోనే సాధ్యపడుతుందని రాష్ట్ర కుమ్మరి శాలివాహన అభివృద్ధి కమిటీ చైర్మన్ ఈశ్వర అన్నారు. మంగళవారం మడకశిర నియోజకవర్గంలోని మడకశిర, అమరాపురం, అగళి తదితర మండలాలల్లో పర్యటించారు. పలు గ్రామాల్లో కుమ్మరి కులవృత్తి చేస్తున్న వారి పరిస్థితులపై ఆరాతీశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణతో విలేకరులతో మాట్లాడారు. కుమ్మరి శాలివాహన కులవృత్తుల వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యల పరిష్కారం కోసం పర్యటించడం జరుగుతోందన్నారు. భవిష్యత్తులో ప్లాస్టిక్ వాడకం తగివ్వ, మట్టి కుండలు, మట్టి గ్లాసులు తదితర వాటి డిమాండ్ పెరగనుందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సహకారం అందిస్తు వెనకబడిన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేయడం సంతోషంచిదగ్గ విషయం అన్నారు. బుధవారం అనంతపురంలో జరిగే సూపర్‌సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్, కన్వీనర్లు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే: సీఐ

హిందూపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు అన్నారు. ఈనెల 7న ఇంటర్‌స్టేట్ ఓపెన్ కరాటే చాంపియన్ పోటీలు కర్ణాటకలో జరిగాయి. ఇందులో పాల్గొన్న హిందూపురానికి చెందిన 14మంది విద్యార్థులు ప్రతిభను చాటారు. వీరిని మంగళవారం సీఐ రాజగోపాల్‌నాయుడు, కరాటే మాస్టర్ నరేష్‌ను అభినందించారు.



ప్రతిభ చాటిన విద్యార్థులతో సీఐ

పురంలో 5కే రెడ్ రన్



మారథాన్ రెడ్ రన్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

హిందూపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మంగళవారం హిందూపురంలో 5కే రెడ్‌రన్ పోటీలు జరిగాయి. మంగళవారం ఉదయం మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్మన్ రమేష్ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. పట్టుగూళ్ల మార్కెట్, గురునాథ్‌సర్కిల్, ఎన్టీఆర్‌సర్కిల్, పాత పోలీస్‌స్టేషన్ సర్కిల్, సూరప్పకట్టకింద నుంచి మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ హెచ్ఐవీపై యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. యువతే దేశానికి వెన్నెముక అన్నారు. ఈ సందర్భంగా మారథాన్ రెడ్ రన్ విజేతలకు చైర్మన్, కమిషనర్, జిల్లా లెప్రసి ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ సునీల్, జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి ఉదయభాస్కర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అకాడమి ఫిజికల్ ఎడ్యుకేషన్ జిల్లా కార్యదర్శి రామక్రిష్ణ, పీఈటీలు లోక్‌నాథ్, సూపర్‌వైజర్ రమణ, ఎన్ఎస్‌పీఆర్ ప్రిన్సిపాల్ ప్రగతి పాల్గొన్నారు.

ఆక్రమణపై సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కోనాపురంలో రోడ్డు ఆక్రమణపై అధికారులు సర్వేచేపట్టారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం కోనాపురంలో రోడ్డు ఆక్రమణ కథనం ప్రచురితమైంది. స్పందించిన నగర పంచాయతీ అధికారులు సిబ్బందితో చేరుకుని రోడ్లను సర్వేచేపట్టారు. ఆక్రమించిన ఇళ్లవద్ద సర్వేచేసి వారికి నోటీసులు అందించి, ఇళ్లకు సంబంధించిన పత్రాలను తీసుకుని కార్యాలయానికి రావాలని సూచించారు.

నోటీసులు జారీ



భవనాన్ని పరిశీలిస్తున్న ఈఓఆర్డీ

రొద్దం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రొద్దంలో రోడ్డుకు అడ్డంగా నిలువెత్తు భవంతులు నిర్మించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా ఆంధ్రజ్యోతి కథనంతో అధికారులు స్పందించి నోటీసులు అందించారు. ఆదివారం రోడ్డుకు అడ్డంగా భవంతులు కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఈఓఆర్డీ గోవిందప్ప స్పందించి మంగళవారం అడ్డంగా ఉన్న భవంతులకు నోటీసులు అందించారు. పంచాయతీ అనుమతులు పొందారా రోడ్డును ఎందుకు ఆక్రమించారని ప్రశ్నించారు. పూర్తీ వివరాలు ఉన్న పత్రాలు తమకు అందించాలని సూచించినట్లు ఈఓఆర్డీ గోవిందప్ప సూచించారు. పంచాయతీ రోడ్డును ఆక్రమించి ఉంటే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆస్పత్రిని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ



గర్భిణులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

సోమందేపల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఫైరోజ్‌బేగం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రతినెలా 9న జరిగే పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రికి వచ్చిన గర్భిణులతో ఆమె మాట్లాడారు. హైరిస్క్ ఉన్న గర్భవతులను గుర్తించి మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. అందుకు గల కారణాలను విశ్లేషించి తగిన సలహాలు, సూచనలు అందించాలన్నారు. అనంతరం ఆసుపత్రిలోని ఓపీని పరిశీలించారు. రోగులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలను అందించాలన్నారు. విధినిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆసుపత్రి వర్గాల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనితీరు మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధినిరోధక కీటకాల అధికారి నాగేంద్రనాయక్, డీపీహెచ్ఎన్ఓ వీరమ్మ, సీహెచ్ఓ వన్నప్ప, వైద్యులు ఓంకార్, ఆయిశ తస్లీం, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

హిందూపురం(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం అన్నారు. మంగళవారం కె.బసవనపల్లి ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వ్యాధులు, ప్రసవాలు, టీకాలపై ఎప్పటికప్పుడు అలర్ట్‌గా ఉన్నారన్నారు. రికార్డులు పరిశీలించారు. ఫీల్డ్‌వర్క్ రికార్డు కచ్చితంగా ఉండాలన్నారు.

వడ్డీ కట్టించుకునే వెసులుబాటు రానుంది

● కెనరా బ్యాంకు జీఎం

రొద్దం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో రైతులు పొందిన రుణాలు వడ్డీమాత్రమే కట్టించుకుని రెన్యూవల్ చేసే వెసులుబాటు త్వరలో రానుందని కెనరాబ్యాంక్ జీఎం శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం రొద్దం మండల పరిధిలోని గౌరాజుపల్లి గ్రామంలో మహిళా సంఘాల సభ్యులకు, రైతులకు ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం కెనరాబ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కెనరాబ్యాంక్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్బీఐ ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని నేషనలైజ్డ్ బ్యాంకుల్లో రైతులకు కేవలం వడ్డీ మాత్రమే కట్టించుకుని రెన్యూవల్ చేసే వెసలుబాటు రాబోతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి వ్యక్తి బ్యాంకులో ఉన్న ఖాతాకు కేవైసీ చేయించుకోవాలన్నారు. ఎన్ని లక్షలైనా రుణాలు అందిస్తామన్నారు. రుణం పొందిన ప్రతి వ్యక్తి అప్పులు సకాలంలో తీర్చగలిగితే మరికొంతమందికి రుణాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక మేనేజర్ ఏజీఎం శ్రీనివాసులు, రొద్దం కెనరా బ్యాంక్ మేనేజర్ గంగాధర్, మాజీ సర్పంచ్ నారాయణ, గ్రామస్థులు, సిబ్బంది పాల్గొన్నారు.